

రెండు ప్రమాదాలు..ముగ్గురి మృతి

రోడ్డుపై మనం జాగ్రత్తగా వెళుతున్నా ఎదురుగానో.. వెనుకనో వచ్చే వారు జాగ్రత్తగా రాకపోతే ప్రమాదమే.. సోమవారం జిల్లాలో జరిగిన రెండు ప్రమాదాలే అందుకు నిదర్శనం. దివాన్‌చెరువులో వెనుక నుంచి టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో తోడికోడళ్లు మృతిచెందగా.. కడియం మండలం దుళ్ల మడికి రోడ్డులో ఎదురుగా బైక్‌పై వచ్చిన యువకులు దంపతులు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొనడంతో భర్త మృతిచెందాడు. - 7లో

లే..ఔట్!

నివాసయోగ్యం కాకపోతే రద్దు



ఇదీ వెలుగుబంద లేఅవుట్.. ఊరికి దూరంగా అడవిలో ఉంటుంది. ఈ కాలనీకి రావాలంటే గగనమే.. ఈ కాలనీలో రాజమహేంద్రవరం నగర ప్రజలకు స్థలాలు కేటాయించడం గమనార్హం.

- పేదల ఇళ్ల లేఅవుట్లపై ఆరా
- నివేదిక కోరిన కలెక్టర్‌ప్రశాంతి
- డిప్యూటీ తహశీల్దార్లకు బాధ్యత
- వారంలో ఇవ్వాలని ఆదేశం
- పేదింటికి వైసీపీ శాపం
- మధ్యలో ఆగిన వేలాది ఇళ్లు
- లోపభూయిష్టంగా లేఅవుట్లు
- పల్లపు లేఅవుట్లపై దృష్టి
- ఇళ్లు కట్టిస్తున్న కూటమి
- అధికారులకు టార్గెట్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

స్థలాలు ఇచ్చేశాం.. ఇళ్లు కట్టుకోవడమే తరువాయి అంటూ నాడు వైసీపీ నాయకులు హడావుడి చేశారు..అయితే ఆ స్థలాలను చూసి పేదలు మాకొద్దు బాబోయ్ అంటూ గగ్గోలు పెట్టారు.జిల్లాలో చూస్తే దేవరపల్లి,గోపాలపురం, రాజమహేంద్రవరం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు నియోజకవర్గాల్లో ఆ పరిస్థితి ఉంది.అయినా మార్పులేదు.. కట్టుకుంటే కట్టుకోండి.. లేదంటే పట్టా రద్దు చేస్తాం అంటూ భయపెట్టినా ఫలితం లేకపోయింది. అయితే ప్రభుత్వం మారడంతో నాడు లేఅవుట్ల పరిస్థితిపై కూటమి ప్రభుత్వం ఆరా తీస్తోంది.. జిల్లాలో లేఅవుట్లు, వాటి పరిస్థితిపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి డిప్యూటీ తహశీల్దార్లకు ఆదేశించారు.ఇప్పటికే ప్రభుత్వం కూడా నివా సయోగ్యం కాని లేఅవుట్లను రద్దు చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.

గత వైసీపీలో నిరాశే..

గత వైసీపీ ప్రభుత్వంలో అనేక చోట్ల నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేశారు. 429 లేఅవుట్లు వేసి 47,053 మందికి స్థలాలు కేటాయించారు.తక్కువ ధర ఉండే భూము లను ఎక్కువ ధరకు కొనుగోలు చేసి రూ.కోట్లలో కుంభకోణానికి పాల్పడిన సంగతి తెలిసిందే.దానికి ఉదాహరణే రాజమహేంద్రవరం నగర ప్రజలకు బూరుగుపూడిలో కేటాయించిన ఆవ భూములు. కొన్ని స్థలాల ఫిల్లింగ్ పేరుతో వైసీపీ నేతలు మట్టినీ తవ్వేసి అమ్మేసుకున్న ఘటనలూ ఉన్నాయి.లేఅవుట్లలో పేదలకు ఇళ్లు పూర్తిగా నిర్మించలేదు కానీ వారి పేరుతో వైసీపీ నేతలు మట్టి, గ్రావెల్ ,భూమి కొనుగోలులో అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు గడించారు. అప్పట్లో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలపై జగన్ బొమ్మకూడా వేసుకుని విస్తృత ప్రచారం చేసుకున్నారు. చివరిలో వైసీపీ నాయకులు ఓట్ల రాజకీయం చేశారు.అనపర్తిలో దొంగ ఇళ్ల పట్టాలు సృష్టించి ఇచ్చే ప్రయత్నం చేశారు. అప్పట్లో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. రాజమహేంద్రవరంలో అయితే స్థలాలు చూపించకుండా పట్టాలు ఇచ్చేశారు. తమకంటూ సొంత గూడు ఏర్పడుతుందని ఆశపడిన పేదలకు నాడు నిరాశే మిగిలింది.

జిల్లాలో 429 లేఅవుట్లు..

జిల్లావ్యాప్తంగా 429 లేఅవుట్లలో 47,053 మందికి స్థలాలు కేటాయించారు. అందులో నివాసయోగ్యం కాని 61 లేఅవుట్లు ఖాళీగా ఉన్నాయి. కేవలం 1 నుంచి 10 ఇళ్ల వరకూ మొదలెట్టినవి 146, 11 నుంచి 50 ఇళ్ల వర కూ మొదలెట్టినవి 144 ఉన్నాయి. 51 నుంచి 100 వరకూ మొదలెట్టినవి 46 లేఅవుట్లు, 101 నుంచి 300 వరకూ నిర్మించినవి 20 లేఅవుట్లు, 301 నుంచి 500 ఇళ్లవరకూ మొదలెట్టినవి 4 లేఅవుట్లు ఉన్నాయి. 5001 నుంచి 1000లోపు ఇళ్లు మొదలెట్టినవి 5, వెయ్యికి పైగా మొదలెట్టినవి 3 లేఅవుట్లు ఉన్నాయి. ప్రభుత్వం నివేదిక వచ్చిన తర్వాత ఈ లేఅవుట్లలో బాగున్న వాటిని కొనసాగించి మిగతావాటిని ప్రభుత్వం రద్దు చేసే అవకాశం ఉంది. లబ్ధిదారులకు కొత్తగా స్థలాలను మంజూరు చేయనుంది.



అర్హులెవరు..అనర్హులెవరు?

జిల్లాలో ఇళ్లు , ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులపై కూటమి ప్రభుత్వం సర్వే చేస్తుంది. ఇంటి పట్టా ఇచ్చారా ఎక్కడ ఇచ్చారు. స్థలం చూపించారా,ఇల్లు కట్టుకున్నారా, కట్టుకోకపోతే కారణం ఏంటి.. పట్టా ఇచ్చి కూడా స్థలం చూపించలేని పరిస్థితి ఉందా వంటి అంశాలపై సర్వే జరుగుతుండడం గమనార్హం. ఇదిలా ఉండగా రెవెన్యూ ఉద్యోగులతో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకూ నాడు ఇళ్ల పట్టాలు.. నిర్మాణాలకు అనుమతిపొందిన లబ్ధిదారుల్లో అర్హులు.. అనర్హుల లెక్క తేల్చారు.

ఇళ్ల కేటాయింపులు ఇలా..

మండలం	లక్ష్యం	ఇళ్లు
దేవరపల్లి	146	46
రాజానగరం	83	21
గోకవరం	45	11
గోపాలపురం	112	27
కడియం	51	12
నల్లజర్ల	182	39
నిడదవోలు	104	18
కోరుకొండ	82	12
తాళ్లపూడి	105	14
ఉండ్రాజవరం	109	13
నిడదవోలు అర్బన్	87	10
రాజమండ్రి రూరల్	111	11
బిక్కవోలు	236	23
రంగంపేట	165	14
కొవ్వూరు అర్బన్	423	27
అనపర్తి	238	14
పెరవలి	56	3
చాగల్లు	213	11
కొవ్వూరు	217	11
సీతానగరం	122	6

పేదలకు కూటమి అండ

జిల్లాలో సొంతంగా ఇళ్లు కట్టుకోలేని పరిస్థితిలో ఉన్న పేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచి వాటిని కట్టి లబ్ధిదారులకు అప్పగించే ప్రయత్నంలో ఉంది.జిల్లాలో 3,823 మంది లబ్ధిదారులకు గతంలో మంజూరు చేసిన రూ.1.80 లక్షలతోనే ఇంటిని నిర్మిస్తుంది. మార్చి నెలాఖరుకు పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు.100 రోజుల కార్యక్రమం కింద ఈ ఇళ్లను పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంతి అధి కారులకు టార్గెట్ ఇచ్చారు.జిల్లా మొత్తం మీద 3823 ఇళ్ల నిర్మాణం లక్ష్యం 717 పూర్తి చేశారు. జిల్లా టార్గెట్‌కు సంబంధించి వెలుగుబంద కాలనీలోనే 936 ఉన్నాయి.ఇప్పటికే 374 పూర్తి చేశారు.43 రోజుల్లో 526 పూర్తి చేయాలి. రోజు కు 13 ఇళ్లు నిర్మించాలనే టార్గెట్ పెట్టారు. కానీ ఇక్కడ ఓ సమస్య ఉంది. సుమారు 120 మంది లబ్ధిదారుల వివరాలు తెలియడం లేదు. వాళ్ల అడ్రస్‌లు,ఫోన్ నెంబర్లు కూడా అందుబాటులో లేవు. అధికారులు ఇబ్బంది పడు తున్నారు.

GBS అ..టెన్షన్!



రాజమహేంద్రవరం పెద్దాసుపత్రికి రెండు అనుమానిత కేసులు

- 3 రోజుల కిందట రోగులు
- కాకినాడకు తరలింపు
- వైద్యులు లేకపోవడమే కారణం
- ఒకరికి నిర్ధారణ కాని వైనం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) రాజమహేంద్రవరం ప్రజలను వణికిస్తోంది. పెద్దాసుపత్రికి మూడు రోజుల కిందట రెండు అనుమానిత కేసులు రావడంతో వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి నిర్ధారణకు కాకినాడ జీజీహెచ్‌కు పంపించారు. వీరిలో ఒకరికి జీబీఎస్ సోకలేదని తేలిందని సమాచారం. మరొకరికి సంబంధించి నిర్ధారణ రావాల్సి ఉందని చెబుతున్నారు. జీబీఎస్‌కు సంబంధించి ప్రాథమికంగా జనరల్ మెడిసిన్ వైద్యులు, న్యూరో విభాగం వైద్యులు పరీక్ష చేయాల్సి ఉంటుంది. రాజమహేంద్రవరం జీటీజీహెచ్‌లో జనరల్ మెడిసిన్‌లో వైద్యులు ఉన్నా న్యూరో విభాగానికి సంబంధించి ఇంకా పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదు. న్యూరో ఫిజీషియన్, న్యూరో సర్జన్ మాత్రమే ఉన్నారు. జీబీఎస్‌ను నిర్ధారించే పరీక్షలు, పరికరాలు ఇక్కడ అందుబాటులో లేవు. దీంతో ఏ అనుమానిత కేసు వచ్చినా కాకినాడ రిఫర్ చేయడం తప్ప మరో మార్గం లేదు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ నిర్ధారణ పరీక్షలు చేసే ఎక్విప్‌మెంట్ ఇక్కడ లేదని, అందువల్లే కాకినాడ పంపుతున్నామని..అయినా జీబీఎస్ అనుమానిత కేసులకు ఆసుపత్రిలో ఏర్పాట్లుచేస్తున్నామని వెల్లడించారు.ప్రత్యేకంగా రెండు బెడ్స్‌తో ఒక గది సిద్ధం చేస్తున్నామన్నారు.



సన్‌రైజర్స్ రైడింగ్ క్లబ్‌కు షీల్డు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో డీటీవో తదితరులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు చేపట్టిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు - 2025 ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు.దీనిలో భాగంగా ఆమె మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం విలువైనది అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. రహదారి భద్రత నియమాలు పాటిస్తున్నామా లేదా అనే దానిపై ఎవరికి వారే స్వీయ ఆలోచన చేసుకోవాలని డీటీవో ఆర్.సురేష్ అన్నారు. వక్తృత్వం, వ్యాసరచన, తదితర పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. సన్‌రైజర్స్ రైడింగ్ క్లబ్‌కు షీల్డు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐలు సీహెచ్ సంపత్‌కుమార్,ఎం.రవికుమార్,జి.రాంనారాయణ్, ఏఎంవీఐలు,ఉద్యోగులు,విద్యార్థులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బోట్స్‌మెన్ సొసైటీల సభ్యులు

ఇసుక పరిమితికి మించితే కేసులే

- భద్రత ప్రమాణాలు పాటించాలి
- నిబంధనలు మీరితే జరిమానా
- ఇసుక కమిటీ సమీక్షలో కలెక్టర్
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

రాజమహేంద్రవరం/సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణా సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించకపోతే కేసులు తప్పవని కలెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు. ఇసుక రవాణా సమయంలో నిబంధనలను బేఖాతరు చేయడంతో లారీల్లోని ఇసుక రోడ్డుపై పడుతూ ప్రమాదాలకు కారణం కావడంపై 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 15న 'ఇసుక రోడ్లు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సోమవారం తన అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో తగు ఆదేశాలు ఇచ్చారు. అధిక లోడు, భద్రతా ప్రమాణాలు పాటించని ఇసుక రవాణా లారీలపై నిఘా ముమ్మరం చేస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలు చేసి జరిమానాలు రాయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ విషయానికి సంబంధించిన కమిటీ నిర్ణయాన్ని మినిట్స్ బుక్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇసుక రవాణా లారీల విషయంలో ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయన్నారు. వాటికి సంబంధించి బాధ్యులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఇక, జిల్లాలో 15 ఓపెన్ ఇసుక రేవుల్లో నిర్దేశించుకున్న 10,39,350 మెట్రిక్ టన్నులకు సంబంధించి 7,35,766 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. సింగవరం , కాటవరంలలో మార్చి 4న, కుమారదేవం మార్చి 5న పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తామన్నారు. కొత్తగా కడియం, పెరవలి, తీపర్రులో రెండు, నిడదవోలులో జీడిగుంట ఏ,బి, పందలపర్రు డ్రాఫ్ట్ మైనింగ్ ప్లాన్ ఆమోదించడం జరిగిందని కలెక్టర్ అధికారులకు సూచించారు. రీచ్‌ల సమీపంలో రహదారుల బాధ్యతను ఏజెన్సీలే చేపట్టాలన్నారు.సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్‌డీవో ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్ రెడ్డి, ఇరిగేషన్ సీఈ కె.నరసింహమూర్తి పాల్గొన్నారు.

డ్రెడ్జింగ్ ఆపాలని ధర్నా

ఉభయగోదావరి జిల్లాల్లో గోదావరిలో డ్రెడ్జింగ్ యంత్రాలతో ఇసుకను అక్ర మంగా తోడేయడం వల్ల 10 వేల మంది బో ట్స్‌మెన్ సొసైటీలు రోడ్డున పడ్డారని జైభీమ్ దళిత ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు చోళ్ళ రాజు వాపోయారు. న్యాయం చేయాలని ఆయా సొసైటీల సభ్యులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. డ్రెడ్జింగ్ యంత్రాల కారణంగా ఇసుక తీత కార్మికులు ఉపాధి పోయిందన్నారు. డ్రెడ్జింగ్ వల్ల గోదావరి నదిపై ఉన్న బ్రిడ్జిల మనుగడ ప్రమాదమన్నారు. వెంటనే డ్రెడ్జింగ్ నిలుపుదల చేసి ఇసుక తీత పనులు చేసుకునే సొసైటీలకు పనులు కల్పించాలన్నారు.తక్షణమే కలెక్టర్ చర్యలు తీసుకుని డ్రెడ్జింగ్ నిలుపుదల చేయించాలని కోరారు.కార్యక్ర మ ంలో లేబర్ యూనియన్ నాయకులు వారా ప్రభాకర్, దేవన వెంకట కృష్ణ,శ్రీకృష్ణ దేవరాయలు, బోట్స్‌మెన్ సొసైటీల నాయకులు పాల్గొన్నారు.



అంగన్ వాడీ!

అంగన్‌వాడీల ఉద్యమం మళ్లీ వేడెక్కింది.. తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం నిరసన ప్రదర్శన చేశారు.. రాజానగరం, కొవ్వూరులో నేలపైనే బైఠాయించి నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం హామీల అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 8

తునిలో.. వై..చీప్ ట్రిక్స్!



తుని మునిసిపల్ కార్యాలయ భవనం

తుని వైస్ చైర్మన్ ఎన్నికలో వైసీపీ డ్రామాలు

- వైసీపీ కౌన్సిలర్లు గైర్హాజరు
- ఇప్పటికే మూడుసార్లు వాయిదా
- పాగాకు వైసీపీ.. టీడీపీ పట్టు
- టీడీపీలో 10 మంది ఫ్యాన్ కౌన్సిలర్లు
- మిగిలిన 17 మంది ఎటువైపో..
- ఆందోళనలో వైసీపీ నాయకులు
- ఎన్నికకు హాజరుకాకుండా నిర్బంధం
- చైర్‌పర్సన్ ఇంట్లో బంధించిన రాజా
- నేడు నాలుగోసారి ఎన్నిక
- కోరం లేక.. రెండుసార్లే వాయిదా
- తరువాత కోరం అవసరమేలేదు

కాకినాడ/తునిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని తుని మునిసిపాలిటీలో వైస్‌చైర్మన్ ఎన్నిక వ్యవహారం రకరకాల మలుపులు తిరుగుతోంది. ఎలాగైనా ఈ కుర్చీలో పాగా వేయాలని టీడీపీ, మిగిలిన సభ్యులు చేజారిపోకుండా కాపాడుకోవాలని వైసీపీ ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. దీంతో కోరం లేక సోమవారం జరగాల్సిన ఎన్నిక మూడోసారీ రద్దయింది. తిరిగి మంగళవారం నాలుగోసారి ఎన్నిక నిర్వహించనున్నారు. ఈసారి కూడా మళ్లీ కోరం డ్రామా కొనసాగుతుందా? లేదంటే ఎన్నిక జరుగుతుందా? అనేది సస్పెన్స్‌గా మారింది. ఈ ఎన్నిక ఎలాగైనా నిర్వహించాలని హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ ఎన్నికకు హాజరుకాకుండా వ్యవహరిస్తుండడం విశేషం.

మూడోసారీ అదే డ్రామా..

తుని మునిసిపాలిటీ వైస్‌చైర్మన్ ఎన్నిక మూడోసారి సోమవారం జరుగుతుందని అంతా భావించారు. కుర్చీ ఏ పార్టీ ఖాతాలో పడుతుందోనని రకరకాల లెక్కలు వేశారు. తీరా యథావిధిగా కోరంలేకపోవడంతో ఎన్నిక రద్దయింది. దీంతో అంతా ఈసురోమనాల్సిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఉదయం 11 గంటలకు ఎన్నిక నేపథ్యంలో ఇటీవల వైసీపీని వీడి టీడీపీలో చేరిన 10 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. దీంతో టీడీపీవైపు పూర్తి హాజరు ఉంది. వైసీపీ నుంచి 17 మంది కౌన్సిలర్లు హాజరవుతారని అధికారులు భావించారు. కానీ సమయం మించిపోతున్నా వైసీపీ కౌన్సిలర్లు మాత్రం రాలేదు. వైసీపీకి చెందిన మునిసిపల్ చైర్‌పర్సన్ తన నివాసంలో వీరందరినీ దాచేయడంతో వీరంతా ఎన్నికకు రాలేని పరిస్థితి. మరోపక్క మాజీ మంత్రి దాడి శెట్టి రాజా సైతం సోమవారం నాటి ఎన్నిక వాయిదా పడేలా ముందునుంచీ కథ నడిపారు. అక్కడకు తుని పట్టణ వ్యాప్తంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను రాజా మోహరించారు. టీడీపీ నుంచి ప్రతిఘటన వస్తే ఎదుర్కొనేందుకు వీలుగా వారిని గొడవకు సిద్ధంచేశారు. అదే సమయంలో టీడీపీ నేతలు చైర్‌పర్సన్ నివాసానికి సమీపానికి వచ్చి ఆందోళన చేపట్టారు. ఎన్నిక జరగకుండా రాజా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కౌన్సిలర్లను స్వేచ్ఛగా సమావేశానికి రానీయకుండా ఓటమి భయంతో నిర్బంధించారని మండిపడ్డారు. దీంతో రాజా, ఆయన అనుచరులు టీడీపీ నేతలతో గొడవకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. దీంతో ఉద్రిక్తతకు దారితీసింది. అటు గొడవను కట్టడి చేయడానికి ప్రయత్నించిన పోలీ సులపై రాజా దురుసుగా వ్యవహరించారు. టీడీపీకి అనుకూలంగా పోలీసులు ఉన్నారంటూ వారిపైకి గొడవకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వేచిచూసిన అధికారులు సగం మంది సభ్యులైన 15 మంది కూడా లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

వైసీపీ ప్రస్తుత వ్యూహం.. కూటమికే ప్రయోజనం?

నిబంధనల ప్రకారం మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి కోరం లేకపోతే రెండు సార్లు మాత్రమే ఎన్నిక వాయిదా వేయొచ్చు. ఆ తర్వాత కోరంతో సంబంధం లేకుండా ఎంతమంది సభ్యులు ఎన్నికకు హాజరైతే వారితోనే ఎన్నిక ప్రక్రియ నిర్వహించేందుకు అవకాశం ఉంది. ఇప్పటివరకు మూడుసార్లు ఎన్నిక రద్దవగా, అందులో రెండుసార్లు శాంతి భద్రతల సమస్య కారణంగా వాయిదా వేశామని, సోమవారం మాత్రమే కోరం లేని కారణంగా ఎన్నిక రద్దయిందని అధికారులు చెబుతున్నారు. మంగళవారం ఇదే కారణంతో ఎన్నిక వాయిదా వేస్తే ఆ తర్వాత మాత్రం హాజరైన సభ్యులతో ఎన్నిక నిర్వహించవచ్చు. మంగళవారం ఎన్నికకు టీడీపీ నుంచి 10 మంది కౌన్సిలర్లు హాజరవుతారు. మరో నలుగురు కౌన్సిలర్లు హాజరైతే తగిన కోరంతో ఎన్నిక జరపవచ్చు.

నేడైనా తేలేనా..

తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక తిరిగి నేడు (మంగళవారం) నాలుగోసారి జరగనుంది. ఈ మేరకు ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. అయితే సోమవారం నాటి ఆందోళనల నేపథ్యంలో మంగళవారం సైతం పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడ జిల్లా నలుమూలల నుంచి బలగాలను దించుతున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.తునిలో మంగళవారం జనం గుమిగూడడం, ఆయుధాలతో సంచరించడాన్ని నిషేధిస్తూ కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు జారీ చేశారు. మరోపక్క తమ కౌన్సిలర్లను ఎన్నికకు హాజరుకాకుండా అడ్డుకుంటున్న వైసీపీ తిరిగి మంగళవారం ఎన్నిక నేప థ్యంలో చలో తునికి పిలుపునివ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే 10 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోవడం, మరికొందరు అదే దారిలో ఉండడంతో ఓడిపోతామనే భయంతో ఎన్నిక జరగకుండా ఎలాగైనా చూడాలని వైసీపీ భావిస్తోంది. ఈ వైసీపీ తీరునే టీడీపీ తప్పుబడుతోంది.



తుని మునిసిపల్ కార్యాలయం వద్ద టీడీపీ కౌన్సిలర్లను కౌన్సిల్ హాల్‌లోకి పంపుతున్న పోలీసులు



చైర్మన్ నివాసం వద్ద టీడీపీ నాయకులతో మాజీ మంత్రి రాజా వాగ్వాదం

'చలో తుని'కి అనుమతి లేదు..

చలో తునికి ప్రభుత్వపరంగా ఎటువంటి అనుమతులు లేవు. చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. సోమవారం జరగాల్సిన ఎన్నిక కోరం సరిపోకపోవడంతో మంగళవారానికి వాయిదా పడింది. కౌన్సిలర్లకు కావాల్సిన పోలీసు రక్షణ ఉంటుంది. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ముందుకు రావాలి. - శ్రీహరిరాజు, పెద్దాపురం డీఎస్పీ

మాజీ మంత్రి రాజాపై కేసు

మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆయన అనుచరులపై కేసు నమోదు చేసినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ స్పష్టంచేశారు. తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నికలో కౌన్సిలర్లు ఓటు వేయకుండా అడ్డుకోవడంతో పాటుగా టీడీపీ నేత పోలిశెట్టి రామలింగేశ్వరరావుపై మాజీ మంత్రి దాడిశెట్టి రాజా దాడి చేయడంపై వచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. వైస్ చైర్మన్ ఎన్నికకు కౌన్సిలర్లు స్వచ్ఛందంగా ఓటు వేసేందుకు ముందుకు రావాలని, పోలీసు రక్షణ అవసరమైతే తుని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.


పురుషుల విభాగంలో హోరాహోరీగా జరుగుతున్న మ్యాచ్


మహిళల విభాగంలో...

నువ్వా...నేనా!

కాకినాడలో మూడో రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు సోమవారం మూడో రోజుకు చేరుకుంది. మహిళలు, పురుషుల విభాగాల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. మహిళల విభాగంలో ఒడిశా సెక్రటేరియట్, హర్యానా సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా 8-0 తేడాతో గెలుపొందింది. ఉత్తరాఖండ్, ఢిల్లీ తలపడగా ఉత్తరాఖండ్ టీమ్ 4-0 తేడాతో గెలుపొందింది. బిహార్, తెలంగాణ జట్ల మధ్య జరిగిన పోరులో బిహార్ 15-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఛత్తీస్‌గఢ్ జట్లు తలపడగా సెంట్రల్ సెక్రటేరియట్ 7-0 తేడాతో గెలు పొందింది. రాజస్థాన్ సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ నడుమ జరిగిన సమరంలో మధ్యప్రదేశ్ టీమ్ 2-0 తేడాతో పైచేయి సాధించింది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ టీమ్ 11-0 తేడాతో గెలుపొందింది.

పురుషుల విభాగంలో.... ఆర్‌ఎస్బీ చెన్నై, ఆర్‌ఎస్బీ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్బీ చెన్నై టీమ్ 6-0 తేడాతో విజయం సాధించింది. ఆర్‌ఎస్బీ అహ్మదాబాద్, ఆర్‌ఎస్బీ ఇండోర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్లు 2-2 గోల్స్ నమోదు చేయడంతో డ్రా అయ్యింది. ఆర్‌ఎస్బీ హైదరాబాద్, ఆర్‌ఎస్బీ ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్బీ హైదరాబాద్ 6-0 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ జి.భానుమూర్తిరాజు ముఖ్య అతిథిగా హాజరు కాగా సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు దేవులనాయక్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు.





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏపీ స్కూల్ గేమ్స్ సెక్రటరీ భానుమూర్తి రాజు, పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు దేవులనాయక్. చిత్రంలో డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు



ఇండియా తరపున ఆడుతున్నందుకు

గర్వపడుతున్నా

సోనికా

ఏషియన్ గేమ్స్ హాకీ గోల్డ్ మెడలిస్ట్, ఢిల్లీ ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్

ఇండియా తరపున హాకీ టీమ్‌లో ఆడుతున్నందుకు ఎంతో గర్వపడుతున్నాను. 2022 కామన్‌వెల్త్ గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్, అదే సంవత్సరం ఏషియన్ గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాను. 2023లో జరిగిన చాంపియన్‌షిప్‌లో ఇండియా టీమ్‌లో మిడ్ ఫీల్డర్‌గా ఆడాను. ఆ గేమ్స్‌లో ఇండియా మొదటి స్థానంలో నిలవడంతో గోల్డ్ మెడల్ సాధించాము. ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి కాకినాడ వచ్చి ఆడుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి

క్రీడాకారులకు ప్రోత్సాహకాలు


ఏషియన్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ సోనికాకి బహుమతి అందజేస్తున్న కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి విచ్చేసిన ఏషియన్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ సోనికాని కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవిచంద్ర ప్రసాద్ కడియాల సోమవారం సత్కరించారు. ఆమెకు బహుమతి అందించారు. అంతర్జాతీయ హాకీ ఒలింపిక్స్ చాంపియన్‌షిప్‌కి ప్రిపేర్ అవుతున్న అర్జున అవార్డు గ్రహీత మహమ్మద్ రియాజ్ కుమార్తె సమీనా రియాజ్‌కు ప్రోత్సాహకంగా రూ.లక్ష చెక్కు అందజేశారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన నేషనల్ గేమ్స్‌లో జిమ్నాస్టిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారునికి రూ.25వేలు చెక్కును క్లబ్ తరపున అందించారు. కార్యక్రమంలో ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియట్ టీం హెడ్ కోచ్ రాజ్‌కుమార్ వర్మ, కోచ్ రవిచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చాలా తక్కువ సమయంలో ఏర్పాట్లు చేశాం

బి.శ్రీనివాస్‌కుమార్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, కాకినాడ జిల్లా

ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి చాలా తక్కువ సమయంలో ఏర్పాట్లు పూర్తిచేశాం. కలెక్టర్ షాన్‌మోహన్ చొరవతోనే గేమ్స్ ఇక్కడ జరగడానికి అవకాశం దక్కింది. 20 రోజులు ముందే అనుమతి రావడంతో కలెక్టర్ చైర్మన్‌గా 13 కమిటీలు వేశాము. ప్రతి కమిటీలో ఒక చైర్మన్‌తో పాటు సభ్యులు నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. ఈ కమిటీలను జాయింట్ కలెక్టర్ పర్యవేక్షిస్తుండగా డీఆర్వో వెంకటరావు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. 25 నుంచి లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ రోజు నుంచే నాకౌట్ మ్యాచ్‌లు మొదలవుతాయి. 26న క్వార్టర్ ఫైనల్,



27న సెమీఫైనల్, 28న ఫైనల్‌తో పాటు క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్‌లో రెండు ప్లేస్‌ల్లో నిలిచిన రెండు జట్ల మధ్య మూడో స్థానం కోసం మ్యాచ్ ఉంటుంది. క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా చూసేందుకు సుమారు 200 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. దేశంలోని అతిపెద్ద టోర్నమెంటు కాకినాడలో జరగడం సంతోషించాల్సిన విషయం. మెడల్స్ సాధించిన వారికి ఆయా డిపార్ట్‌మెంట్స్ నుంచి ఉద్యోగోన్నతులు, ఇంక్రిమెంట్లు కూడా ఇస్తారు. 22 కంపెనీల స్పాన్సర్‌షిప్‌తో టోర్నమెంటును ఘనంగా నిర్వహిస్తున్నాము.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి

వైభవంగా శివకేశవుల ప్రతిష్ఠోత్సవం

- ఇర్రిపాకలో ఆధ్యాత్మిక శోభ
- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు


శివకేశవుల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జగ్గంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఏలేరు నదీ తీరాన శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ-మణి దంపతులు కర్తలుగా పాల్గొనగా ప్రసన్న వేంకటేశ్వర స్వామి, కోటిలింగేశ్వరుడు విగ్రహాల ప్రతిష్ఠ కుమ్మరిలోవ తపోవనం పీఠాధిపతి సచ్చిదానందస్వామి, శృంగేరీ పీఠం ఆంధ్ర-తెలంగాణ ప్రచారకర్త బంగారయ్యశర్మ, శృంగేరీ పీఠం వారణాసి ఇన్‌చార్జి ఇంద్రగంటి సత్యం, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ జరిగింది. జ్యోతుల నవీన్-లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు-సునీత దంపతులు, జ్యోతుల నెహ్రూ మనవడు అనీష్ నెహ్రూ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, దాట్ల బుచ్చిబాబు, వరుపుల సత్యప్రభ, టీటీడీ పాలక మండలి సభ్యులు పనబాక లక్ష్మి, జానకీ దేవి, బెంగళూరు దర్శన్,



వేంకటేశ్వర స్వామికి హారతి

కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు వరుపుల సుబ్బారావు, ఎస్వీఎస్‌ఎన్ వర్మ, మాజీ ఎమ్మెల్సీలు చిక్కాల రామచంద్రరావు, ఆదిరెడ్డి అప్పారావు, చైతన్యరాజు, అనంత ఉదయభాస్కర్, టీడీపీ నేత వాసిరెడ్డి ఏసుదాసు, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ ఇన్‌చార్జి వర్మ, రాజమహేంద్రవరం మాజీ మేయర్ ఆదిరెడ్డి వీర రాఘవమ్మ, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల బాబు, సూరంపాలెం బాలు, ఎల్లపు దొరబాబు, మాదారపు వీరబాబు, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మొగిలి గంగాధర్, తామరాడ ఎంపీటీసీ గోకేడ రాజా, గోకేడ ప్రసాద్, కర్నాకుల సూరిబాబు, అధిక సంఖ్యలో కూటమి నాయకులు వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. వచ్చిన వారంతా శివకేశవులను దర్శించుకుని అన్న, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


ప్రతిష్ఠ జరిపిస్తున్న తపోవనం సచ్చిదానంద స్వామి

పండ్ల గిడ్డంగిలో భారీ అగ్ని ప్రమాదం

- దివాన్‌చెరువు ఫ్రూట్స్ మార్కెట్‌లో ఘటన
- గొడౌన్‌లో చెలరేగిన మంటలు
- పలు రకాలు పండ్లు సహా రెండు బైకులు దగ్ధం
- మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది


మంటల్లో కాలిపోతున్న గొడౌన్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని పండ్ల మార్కెట్‌లో ఓ గొడౌన్ అగ్నికి ఆహుతైంది. దివాన్‌చెరువు పండ్ల మార్కెట్‌లో ఇనుప రేకులతో వేసిన ఆరాధ్యుల శ్రీనివాసరావు(ఏఎస్‌ఆర్)కు చెందిన పండ్ల గిడ్డంగిలో సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో లోపల ఉన్న ప్లాస్టిక్ ట్రేలు అంటుకుని అమ్మకం కోసం నిల్వచేసిన ఆపిల్, దానిమ్మ, కర్బూజ, డ్రాగన్ తదితర రకాల పండ్లు కాలిపోయాయి. వాటితోపాటు సమీపంలోని పండ్ల దుకాణంలో ఉంచిన రెండు బైకులు కాలిపోయాయి. స్థానికులు రాజమహేంద్రవరంలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఈ.స్వామి, జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్‌తో బాటు ఆర్యాపురం, ఇన్నీసుపేట, కొవ్వూరుల నుంచి మూడు అగ్నిమాపక శకటాలు ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.10 లక్షలు విలువ చేసే పండ్లు, 15 వేల ట్రేలు, గిడ్డంగి దగ్ధమయ్యిందని, సుమారు రూ.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు శ్రీనివాసరావు చెప్పారు. కాగా కాల్చి పడేసిన సిగరెట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నామని, ఆస్తి నష్టం సుమారు రూ.25 లక్షలు ఉండొచ్చని అగ్నిమాపక శాఖాధికారులు చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, వైసీపీ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్, డీఎస్పీ భవ్య, బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్ పరిశీలించారు. గిడ్డంగి యజమాని, అగ్నిమాపక అధికారులను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. బాధితుడితో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని అన్నారు. పండ్ల గిడ్డంగిలో ప్రమాదం మానవ తప్పిదం వల్లే జరిగిందన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ఈఎస్ఐ ఆసుపత్రి తనిఖీలో కార్మిక శాఖ మంత్రి సుభాష్
- హాజరుపట్టీ పరిశీలన... రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా
- విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు చార్జ్ మెమోలు ఇవ్వాలని ఆదేశం


ఈఎస్ఐ ఆసుపత్రిలో ఉద్యోగుల హాజరును పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం చూపితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు విభాగాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరుపట్టీని పరిశీలించిన ఆయన విధులకు గైర్హాజరైన ఉద్యోగుల వివరాలపై ఆరా తీశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, మరికొంతమంది సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు ఛార్జ్ మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పారిశుధ్య నిర్వహణ, సిబ్బంది రోగుల పట్ల అనుసరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసి భారీగా నిధులు కేటాయిస్తోందని, ఇందులో భాగంగా రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాగానే రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు త్వరలోనే సమకూరుతాయని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.

కాకినాడ ఆర్‌ఎంసీలో

నేడు, రేపు మాక్ డ్రిల్

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో మంగళ, బుధవారాల్లో తీవ్రవాద చర్యల నిరోధక సంస్థ ఆక్టోపస్ మాక్‌డ్రిల్ నిర్వహించనుంది. 2రోజుల పాటు జరిగే ఈ మాక్‌డ్రిల్‌లో ఆకస్మికంగా టెర్రరిస్టులు దుశ్చర్యలకు పాల్పడితే తిప్పికొట్టే చర్యలపై శిక్షణనివ్వనున్నారు. మాక్‌డ్రిల్ నిర్వహించడంతో పాటు రెక్కీ నిర్వహించాల్సిన విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నారు.

ప్రేమించి.. పెళ్లి చేసుకోనని..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లికి ముఖం చాటేయడంపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పిడింగొయ్యికి చెందిన ఎల్.కుమార్ మత్స్యకార వలల వ్యాపారం చేస్తుంటాడు. మూడేళ్ల క్రితం షెల్టాన్ హోటల్ సమీపంలోని ఓ యువతితో పరిచయం ఏర్పడింది. అయితే తాము అప్పటి నుంచీ ప్రేమించుకుంటున్నామని, పెళ్లి విషయం వచ్చేసరికి అతడు ఒప్పుకోవడం లేదని యువతి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్త సందోహం

- ఘనంగా వీరభద్రుడి సంబరం
- వేళంగికి పోటెత్తిన భక్తులు

కరప, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో సోమవారం వీరభద్రుడి సంబరం ఘనంగా జరిగింది. రెండేళ్లకోసారి మాఘమాసం మూడో సోమవారంనాడు దాలిపర్తి గోవిందు కుమారులు ఈ వీరభద్రుడి సంబరాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తజనం తరలిరాగా కుమ్మర్ల గడ్డె నుంచి స్వామివారిని ఊరేగించారు. చెరువుగట్టు మీద జమ్మిపూజ చేసిన అనంతరం సంప్రదాయాలను అనుసరించి తలపై వీరభద్రుడి ప్రతిమలను పెట్టుకుని ప్రభలతో తిరిగి గడ్డెకు చేరుకున్నారు. వీరభద్రుడికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తదనంతరం భారీ అన్నసంతర్పణ, రాత్రికి సంబరం జరిగింది. వీరభద్రుడి ఊరేగింపు సందర్భంగా వేళంగి ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కరప పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాలను మళ్లించడంతో పరిస్థితి చక్కబడింది.


వేళంగిలో భారీ జనసందోహం నడుమ వీరభద్రుడి ఊరేగింపు

గంజాయి కేసులో ఐదుగురి అరెస్ట్

ప్రధాన నిందితుడు పరారీ

కోరుకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గంజాయిని సేకరించి విక్రయాల కోసం విభజించుకుంటుండగా పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను పట్టుకుని వారి నుంచి సుమారు రెండు కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ సోమవారం సాయంత్రం తెలిపారు. కోరుకొండ మండలం జంభూపట్నం పంచాయతీ పరిధిలో అయ్యన్నగల్ల సమీపంలోని రోమ్ సిటీ వద్ద ఐదుగురు వ్యక్తులు ఒక గంజాయి మూటతో ఉండగా వారిని విచారించి సోదా చేయగా వారి వద్ద సుమారు 2 కిలోల గంజాయి లభించిందన్నారు. కోరుకొండకు చెందిన గంటివాడ లోవరాజు, గోకరకొండ నరేంద్ర, కామిశెట్టి చరణ్‌కుమార్, శ్రీరాంపురం గ్రామానికి చెందిన గోలుకొండ చంద్రదుర్గ, శ్రీరంగపట్నానికి చెందిన నడిపల్లి అంజిసాయిలను అరెస్ట్ చేశామన్నారు. ప్రధాన నిందితుడు, జంభూపట్నం గ్రామానికి చెందిన కాళ్ల నరేష్ పరారీలో ఉన్నాడని డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ డీవీఎస్ఎస్ శ్యామ్‌సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టించేందుకే 'చలో తుని'కి పిలుపు



తుని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కూటమి నాయకులు

- తుని మాజీ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాపై కూటమి నాయకుల ధ్వజం

తుని రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన తునిలో అల్లర్లు సృష్టించేందుకే వైసీపీ నాయకుడు దాడిశెట్టి రాజా చలో తునికి పిలుపునిచ్చాడని కూటమి నేతలు ధ్వజమెత్తారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ పోలీసులు వచ్చి ఎన్నికలు సజావుగా జరగాలని ప్రయత్నిస్తే వారిపై ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నావని నిలదీశారు. వైసీపీ కౌన్సిలర్లను టీడీపీ నేతలు కిడ్నాప్ చేయలేదని, వారిని దాడిశెట్టి రాజాయే కిడ్నాప్ చేశారంటూ వారి కుటుంబసభ్యులు తమ వద్దకు వచ్చి గోడు వెలిబుచ్చుకుంటున్నారని తెలిపారు. కాపులపై కేసులు పెట్టించింది సీఐ చెన్నకేశవరావు కాదని, మీ పక్కనే ఉన్న యనమల కృష్ణుడని గుర్తుచేసుకోవాలని కోరారు. ప్రశాంతంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు సహకరిస్తే తుని మున్సిపల్ వైస్‌చైర్మన్ పదవి టీడీపీ ఖాతాలో పడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యనమల రాజేష్, తుని పట్టణ టీడీపీ అధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, బోనం చినబాబు, తమరాన సత్యనారాయణ, గంటల సత్యనారాయణ పాల్గొన్నారు.

'చలో తుని'కి రండి.. జయప్రదం చేయండి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైసీపీ కార్యకర్తలకు కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపు

తుని రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చలో తుని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల వైసీపీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. సోమవారం తునిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ కౌన్సిలర్లను టీడీపీ నాయకులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, తాను వచ్చి అడ్డుకున్నానని అన్నారు. 17మంది కౌన్సిలర్లతో సంతకాలు చేసి ఎన్నికల అధికారికి అందజేశామని, నేడు జరిగే ఎన్నికలో కలెక్టర్, ఎస్పీ సమక్షంలో ఎన్నికకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ పార్టీ నాయకుడు యనమల కృష్ణుడు మాట్లాడుతూ అసలు తునిలో ప్రజాస్వామ్యం ఉందా అంటూ ప్రశ్నించారు. మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణితోపాటు పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారు.

క్షణికావేశంలో భర్తపై దాడి

- కూలి డబ్బుల విషయమై భార్యభర్తల మధ్య వివాదం
- భార్యపై దాడి చేయబోయిన భర్త
- తప్పించుకుని భర్తపై కత్తితో దాడి చేసిన భార్య
- ఆపై అతడ్ని ఆస్పత్రిలో చేర్చిన వైనం
- శంఖవరం మండలం పెదమల్లాపురంలో ఘటన



గాయపడిన దానేశ్వరరావు

శంఖవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తనపై కత్తితో దాడి చేసేందుకు వస్తున్న భర్తను ఆపి.. అదే కత్తితో భార్య తిరిగి నరికింది. రక్తపు మడుగులో ఉన్న భర్తను చూసి ఆమె వెంటనే ఆస్పత్రికి తరలించింది. కాకినాడ జిల్లా శంఖవరం మండలం పెదమల్లాపురంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెదమల్లాపురానికి చెందిన తిన్నింటి దానేశ్వరావుకు, భార్య సన్యాసమ్మ దంపతులు. వీరి మధ్య సోమవారం కూలి డబ్బుల విషయంలో మాటామాటా పెరిగింది. కష్టపడి సంపాదించిన డబ్బుతో మద్యం తాగేస్తుండడంపై భర్తను ఆమె గట్టిగా నిలదీసింది. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. ఈ ఘటనలో భార్యపై భర్త కత్తితో దాడికి తెగబడబోయాడు. ఈ సమయంలో ఆమె ఆ కత్తి లాక్కొని భర్త పీకపై సన్యాసమ్మ ఒక్కవేటు వేసింది. రక్తపు మడుగులో ఉన్న భర్తను చూసి ఆమె వెంటనే స్థానికుల సహాయంలో అంబులెన్సుకు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించి దగ్గరుండి వైద్యం చేయించింది. కాగా, ధానేశ్వరరావుకు ఏ ప్రమాదం లేదని, దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదని, ప్రాథమిక విచారణ చేస్తున్నామని అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు.

ఆత్రేయపురం పూతరేకుల కేంద్రాలపై..

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

- 160 కిలోల కల్తీనెయ్యి స్వాధీనం
- పూతరేకులు, నెయ్యి శాంపిల్స్ పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు..
- ఫుడ్‌సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు



ఆత్రేయపురంలో కల్తీనెయ్యి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నకల్తీనెయ్యి షాపులపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ఆత్రేయపురంలో తయారు చేస్తున్న పూతరేకుల్లో విచ్చలవిడిగా కల్తీనెయ్యి వాడుతున్నారనే ఆరోపణలపై రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ కమిషనరు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫుడ్‌సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు రెక్కయ్య, సుబ్బారావు, ప్రసాద్, శ్రీకాంత్‌చౌదరిల బృందం ఏకకాలంలో వేర్వేరుగా కల్తీనెయ్యి అమ్ముతున్న షాపులు, పూతరేకుల తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. పూతరేకుల్లో కల్తీనెయ్యి వాడుతున్నారని తద్వారా ప్రజల ఆరోగ్యం గుల్లవుతుందన్న ఆరోపణలపై ఈ బృందం దాడులు నిర్వహించింది. ఆత్రేయపురం, రేవు సెంటర్‌ల్లో వివిధ షాపులపై దాడులు చేశారు. డ్రైఫ్రూట్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహించగా ప్లాస్టిక్‌కవర్లలో ఏ కంపెనీ బ్రాండ్లు లేని కల్తీ నెయ్యిగా అనుమానించిన 160కిలోల నాసిరకం నెయ్యిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పూతరేకుల తయారీ కేంద్రంలో పూతచుట్టలను సీల్డ్‌కవర్లలో భద్రపరిచారు. నెయ్యి, పూతరేకులను హైదరాబాద్ ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం పంపిస్తున్నట్లు తద్వారా వచ్చే రిపోర్టు ఆధారంగా షాపులు, ఆయా వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు చేపడతామని కంట్రోలర్ శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు షాపులపై దాడులు నిర్వహించారు.

ఆరోగ్యాలపై చెలగాటం ఆడితే చర్యలు

కల్తీ నెయ్యి తయారు చేస్తున్న స్వీట్లను ప్రజలకు అమ్మితే చట్టప్రకారం చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ శ్రీనివాస్ హెచ్చరించారు. పూతరేకుల్లో కల్తీనెయ్యి వాడుతున్నారని వచ్చిన ఫిర్యాదులపై ఈ దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఆరోగ్యాలను కాపాడుకోవాలని, బ్రాండ్లు లేని నెయ్యితో పూతరేకులు తయారు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుడ్ లైసెన్సు తీసుకుని ప్రతి షాపులో తప్పనిసరిగా ప్రదర్శించాలని, నాణ్యత ప్రమాణాలతో అమ్మకాలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం 8 శాంపిల్స్ సేకరించామని, 160 కిలోల నాసిరకంగా నెయ్యిగా అనుమానించి స్వాధీనం చేసుకుని భద్రపరిచామన్నారు. ల్యాబ్‌కు పంపిన నివేదిక ఆధారంగా చర్యలు తప్పవన్నారు. త్వరలోనే మరిన్ని దాడులు చేపడతామన్నారు.

బాలిక కిడ్నాప్.. ఆపై అత్యాచారం

- ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో కేసు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంమండలం అనాతవరంలో 8వ తరగతి చదువుతున్న 15ఏళ్ల బాలికను ఓ వ్యక్తి కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. దీనికి సంబంధించి ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన వివాహితుడు పరమట దుర్గాప్రసాద్ అలియాస్ బులిచంటి సోమవారం స్కూల్‌కు వెళ్తున్న బాలికను మాయమాటలు చెప్పి బలవంతంగా మోటారుసైకిల్‌పై ఎక్కించుకుని కిడ్నాప్ చేశాడని, ఆమెను అమలాపురం వైపు తీసుకువెళ్లి అక్కడఒక నివాసగృహంలో ఆమెపై అత్యాచారంచేశాడని తెలిపారు. బాలిక స్కూలుకు రాకపోవడం, ఓ వ్యక్తి మోటారుసైకిల్‌పై తీసుకువెళ్లిన విషయాన్ని తోటి విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సమాచారం అందించారు.ఆయన విద్యార్థిని తండ్రికి ఫోన్‌లో విషయాన్ని తెలియచేశారు. దీంతో విద్యార్థిని తండ్రి విషయాన్ని ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలాసాగర్ గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటికే నిందితుడు దుర్గాప్రసాద్ అమలాపురం ఎర్రవంతెనవద్ద బాలికను బస్సు ఎక్కించి పరారయ్యాడు. ఈ మేరకు ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బాలికపై ఆటోడ్రైవర్ అత్యాచారం

- మండపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు

మండపేట, ఫిబ్రవరి, 17(ఆంధ్రజ్యోతి) మండపేటలో పదో తరగతి బాలికపై ఓ ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. మండపేట పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట పట్టణంలోని గొల్లపుంతకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ క్రాంతికుమార్(25)కు భార్య, కుమారుడు ఉన్నారు. మండపేట పట్టణంలోనే పదో తరగతి చదువుతున్న ఓ బాలికతో అతడికి పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ సురేష్ విలేఖరులకు తెలిపారు.

టిప్పర్ ఢీకొని తోడికోడళ్లు మృతి

- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు
- రాజానగరం మండలం దివాన్‌చెరువులో ఘటన



సంఘటనా స్థలంలో రిబ్కా, చంద్రం మృతదేహాలు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కూలిపనికి వెళ్లి ఓ వ్యక్తి మోటారుసైకిల్‌పై వస్తుండగా టిప్పర్ ఢీకొన్న ఘటనలో తోటికోడళ్లు మృతి చెందిన ఘటన విషాదం నింపింది. జాతీయ రహదారిపై బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌పరిధిలోని దివాన్‌చెరువులో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన కప్పల రిబ్కా(50), కప్పల చంద్రం(49) ఇదే మండలంలోని పాలచర్ల రోడ్డులోని నర్సరీలో కూలి పనికి వెళ్లారు. పని ముగించుకుని నాగేశ్వరరావు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై రాజానగరం వైపు వెళ్తున్నారు. వీరు దివాన్‌చెరువులోని పండ్ల మార్కెట్ వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి వస్తున్న టిప్పర్ ఢీకొని వీరిపైనుంచి వెళ్లిపోవడంతో రిబకా, చంద్రం అక్కడికక్కడే మృతి చెందారు. నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బొమ్మూరు ఎస్ఐ రమేష్ తెలిపారు.

రైళ్ల రాకపోకల సమాచారం ఏదీ



సామర్లకోటలో పాత రైళ్ల రాకపోకలు టైం టేబులు

సామర్లకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో అత్యధిక ఆదాయం రైలు ప్రయాణికుల ద్వారా సామర్లకోట జంక్షన్ రైల్వేస్టేషన్‌లో లభిస్తున్నా ఆ రీతిలో ప్రయాణికులకు రైళ్ల రాకపోకల సమాచారం సైతం స్పష్టంగా ప్రకటించడంలేదు. సామర్లకోట స్టేషన్‌కు నిత్యం విజయవాడ, విశాఖల వైపు 66 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. వాటి రాకపోకల సమాచారాన్ని తెలియపరిచే టైంటేబులులో గత రెండేళ్ల క్రితం (1.10.2023) నాటి సమయాలు నేటికీ మార్చకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బుకింగ్ కార్యాలయంలో ప్రయాణికులు ఆయా రైళ్ల రాకపోకలకు సంబంధించి సమాచారం అడిగితే చిరుబుర్రులాడుతుంటారు. ఇదే విషయమై ఇటీవల రైల్వే డీఆర్ఎం అధికారి నరేంద్ర ఆనందరావు పాటిల్ సామర్లకోట పర్యటనకు విచ్చేసినపుడు పలువురు ప్రయాణికులు టైంటేబులు దుస్థితిపై ఫిర్యాదు చేయగా మరుసటి రోజే మార్పులు చేయాలని సదరు డీఆర్ఎం సిబ్బందిని ఆదేశించారు. 15 రోజులు గడుస్తున్నా నేటికీ అదే టైంటేబులు ఉండడంపట్ల రైల్వే అధికారుల్లో మార్పులు వచ్చేదెన్నడోనని ఆందోళన చెందుతున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గండేపల్లి మండలం మల్లేపల్లిలో ఘటన

గండేపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ కొనుగోలుకు తల్లిని అడిగితే డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన ఎడ్ల సామేలు(30) వివాహమై భార్యతో కలిసి వేరు కాపురం ఉంటున్నాడు. మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా తిరుగుతున్నాడు. ఈనెల 16న తల్లి దగ్గరకు వెళ్లి సెల్‌ఫోన్ కొనుక్కోవడానికి డబ్బులు అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో గడ్డి మందుతాగాడు. అతడిని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బైక్‌లు

- భర్త మృతి.. భార్యకు గాయాలు
- మడికి-దుళ్ల రహదారిలో ఘటన

ఆలమూరు/కడియం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో భర్త మృతిచెందగా భార్యతోపాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన గంటా రాజు(27), అతడి భార్య కుమారి కొత్తపేట మండలం మందపల్లిలో ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరు మడికి- దుళ్ల రోడ్డులోకి వచ్చేసరికి వీరి వాహనాన్ని మరో మోటారుసైకిల్ ఢీకొంది. దీంతో రాజు, కుమారిలకు తీవ్రగాయాలవ్వగా రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వేరే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌లో ఎక్కించేలోపు రాజు మృతిచెందగా కుమారి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా రాజు దంపతులకు ఏడాది వయస్సు ఉన్న ఓ కుమార్తె ఉంది. అతడు కేశవరంలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని స్థానికులు తెలిపారు. దీనిపై ఆలమూరు ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ కలెక్టరేట్‌లో దళిత మహిళ ఆత్మహత్యాయత్నం

- వైసీపీ నాయకులు తమ భూమి కబ్జా చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు
- వెంటనే బయటకు వచ్చి పురుగుల మందు తాగిన మహిళ
- జీజీహెచ్‌కు తరలించిన సిబ్బంది



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీదేవి

కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో దళిత మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వైసీపీ నాయకులు తమ భూమిని తప్పుడు డాక్యుమెంట్లతో కబ్జా చేశారని ఆమె ఆరోపించారు. సోమవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చి బయటకు వచ్చిన తర్వాత ఆమె పురుగుల మందు తాగింది. వెంటనే కలెక్టరేట్ సిబ్బంది ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతోంది. కాకినాడ పేర్రాజుపేటకు చెందిన మందపల్లి శ్రీదేవి సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసింది. తన భూమిని వైసీపీ నాయకులు గుర్రాల అనిల్‌కుమార్, గుర్రాల నాగేంద్రప్రసాద్, నల్లమిల్లి వెంకటరామిరెడ్డి తప్పుడు డాక్యుమెంట్లతో ఆక్రమించారని ఆరోపించారు. దీంతో కలెక్టర్ స్పందించి ఆ వివరాలను జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు పంపించారు. దీనిపై విచారణ చేయాలని ఆదేశించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని ఆమె తీవ్ర ఆవేదన చెందుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ మేరకు ఆమె కుటుంబసభ్యుడు మందపల్లి హరి అనే వ్యక్తి విలేకరులకు పలు విషయాలు వివరించాడు. గత ప్రభుత్వ హయాంలో కాకినాడ నగరంలో వైఎస్ఆర్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో తమ భూమిని కోల్పోయామన్నారు. ఆ భూమికి బదులుగా ప్రభుత్వం దగ్గర్లోని పేర్రాజుపేటలో తమ ముగ్గురు అన్నదమ్ములకు కలిపి 200 గజాలు పట్టా ఇచ్చిందన్నాడు. 2021 నుంచి వైసీపీ నాయకులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఆస్థలాన్ని కబ్జా చేయడానికి బెదిరిస్తున్నారని తెలిపాడు. దీనిలో కొంత మేర తమకు తెలియకుండా విక్రయించారని ఆరోపించాడు. సర్వేనెంబరు 91/1, టీఎస్ నెంబర్ 150/1లో తమ పట్టాభూమి ఇచ్చారని తెలిపాడు. వైసీపీ నాయకులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడమే కాకుండా కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్లు తెచ్చారన్నాడు. ఈ నేపథ్యంలో టూటౌన్ పోలీసుల ద్వారా తమను ఇళ్లు ఖాళీ చేయించేందుకు బెదిరిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో వారివల్లే తన భర్త మందపల్లి రాజు ఆత్మహత్య చేసుకుని మృతి చెందారని శ్రీదేవి ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో ఆమె పేర్కొన్నారు. తమను అధికారులే రక్షించాలని కోరారు. దీనిపై కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్ర మాట్లాడుతూ ఈ వివాదంపై తమకు ఫిర్యాదు రాగా విచారణ చేస్తున్నామన్నారు. వివాదాలు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో రెండు వర్గాలను బైండోవర్ చేసినట్టు తెలిపారు.

14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ వేడుకలు

- అదే రోజు భారీ బహిరంగసభ
- గతంలో మూడురోజులు నిర్వహించాలని ప్రతిపాదన
- తాజాగా ఒకరోజుకే పరిమితం

పిఠాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు మార్చి 14న పిఠాపురంలో నిర్వహించనున్నారు. గతంలో మూడురోజులపాటు ప్లీనరీసమావేశాలు నిర్వహించాలని భావించినప్పటికీ తాజాగా దాన్ని మార్పు చేస్తూ ఒకరోజుకే పరిమితం చేశారు. అదే రోజు పిఠాపురంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. జనసేన పార్టీ ఆవిర్భవించి దశాబ్దకాలం పూర్తయిన సందర్భంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని గతంలో భావించారు. ఇందుకుగాను తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో మూడురోజులపాటు ప్లీనరీ సమావేశాలు నిర్వహించి చివరిరోజున బహిరంగ సభ ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భావించారు. ఇందుకోసం ఆ పార్టీ నాయకులు అనువైన ప్రాంతాలకోసం పరిశీలన జరిపారు. పిఠాపురం, గొల్లప్రోలు బైపాస్‌రోడ్డుతోపాటు 216వ జాతీయ రహదారి వెంబడి పలు పంట పొలాలు, లేఅవుట్ స్థలాలు అప్పట్లో పరిశీలించారు. చిత్రాడ శివారులోని ఒక భారీ వెంచర్ ఆవరణ ఇందుకు అనుకూలంగా ఉంటుందని గుర్తించారు. మార్చి 12, 13, 14వ తేదీల్లో ప్లీనరీ ఉంటుందని అప్పట్లో ప్రకటించారు. తాజాగా నిర్ణయంలో మార్పు జరిగింది. జనసేన ఆవిర్భావ వేడుకలను 14న పిఠాపురంలో నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిర్ణయం తీసుకున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. అసెంబ్లీ, లోక్‌సభలో ఎన్నికల్లో నూరుశాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించిన తర్వాత నిర్వహిస్తున్న కార్యక్రమం కావడంతో భారీగా నిర్వహించాలని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి పవన్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

జీజీహెచ్‌లో ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

- రోగిని శస్త్రచికిత్సకు సిద్ధం చేసేందుకు లంచం డిమాండ్ చేసిన సిబ్బంది
- విచారణ అనంతరం చర్యలు తీసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్

జీజీహెచ్(కాకినాడ), జనవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. వివరాలిలా ఉన్నాయి. జీజీహెచ్‌లోని ఫ్యామిలీ ప్లానింగ్ ఓటీలో కొద్దిరోజుల క్రితం ట్యూబెక్టమీ ఆపరేషన్ కోసం ఓ మహిళ చేరింది. ఆమెకు ఈ నెల 15వతేదీన శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ వ్యవహారంలో ఆ ఓటీలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వ్యవహరించిన తీరు ఆందోళన కలిగించింది. ఆమెను శస్త్రచికిత్సకు సిద్ధం చేసేందుకు ముగ్గురు సిబ్బంది లంచం డిమాండ్ చేశారు. డబ్బులు తర్వాత ఇస్తామనడంతో శస్త్రచికిత్సను తాత్సారం చేశారు. రూ.300 లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తర్వాత ఇస్తామని బాధితురాలి కుటుంబీకులు చెప్పినా వినలేదు. శస్త్రచికిత్సకు ఆటంకం కలిగించి డబ్బులు ఇచ్చిన తరువాత మాత్రమే ఆమెను సిద్ధం చేశారు. ఈ చేదు అనుభవాన్ని శస్త్రచికిత్స అనంతరం బాధితురాలి కుటుంబసభ్యులు ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన శనివారం ఉదయం చోటు చేసుకోగా మధ్యాహ్నం వారు ఫిర్యాదు చేశారు. అదేరోజు సాయంత్రం ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ తమ బృందంతో విచారణ చేశారు. విచారణలో ఆరోపణలు వాస్తవాలుగా నిర్ధారణ అయ్యాయి. అదనంగా అక్కడ ఉన్న మరికొద్ది మంది రోగులను విచారించగా అక్కడ ఉన్న సిబ్బందితో పడుతున్న వ్యథను వారు కూడా అధికారులకు విన్నవించారు. అందుకు వీడియోఆధారాలను కూడా విచారణాధికారులకు అందించారు. ఆ నివేదికను ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారికి అందించారు. ఈ నేపథ్యంలో సోమవారం రెగ్యులర్ ఎఫ్ఎన్ఓ వీరలక్ష్మి, కాంట్రాక్ట్ బేసిక్ ఎంఎన్‌వో రవితేజ, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికురాలు మంగలపై సస్పెన్షన్ వేటు వేస్తూ సోమవారం సూపరింటెండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు.

పిఠాపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం

- 20మందికి గాయాలు





పిచ్చికుక్క విచక్షణారహితంగా కరవడంతో గాయపడిన విద్యార్థి, చిన్నారి

పిఠాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేయడంతో 20మందికి గాయాలయ్యాయి. పిఠాపురం పట్టణంలోని మంగాయమ్మరావుపేట, చిట్టోడితోట పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పిచ్చికుక్క రోడ్డుపై వెళ్తున్నవారిపై దాడి చేసి గాయపరిచింది. పట్టణంలోని ఏకేపీఎం మునిసిపల్ ఉన్నత పాఠశాల, ఇతర పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, రోడ్డుపై ఆడుకుంటున్న మూడు సంవత్సరాల లోపు చిన్నారులతో సహా 20మందిని విచక్షణారహితంగా కరవడంతో గాయాలయ్యాయి. ఒక మహిళ తొడపై కరవడంతో తీవ్ర గాయమైంది. దీనితో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సాయంత్రం స్థానికులు కుక్కను హతమార్చారు. కుక్కకాటుతో గాయపడిన వారు పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి రాగా వైద్యులు చికిత్స అందించారు. ఇందులో ఇద్దరు చిన్నారులకు ముఖం, చాతిపై గాయాలవ్వడంతో వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు.

యువకుడి కిడ్నాప్ కేసులో ఐదుగురు వ్యక్తుల అరెస్టు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణానికి చెందిన యువకుడిని కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేసిన సంఘటనలో ఐదుగురు వ్యక్తులను సోమవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని దేవీనగరం ప్రాంతానికి చెందిన ఉమ్మిడి గంగాధర్‌ను కిడ్నాప్ చేసి పిఠాపురం పట్టణంలోని రథాలపేట శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి బీరుబాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడి చేయడంతోపాటు సిగరెట్లతో కాల్చి చిత్రహింసలకు గురిచేసిన సంగతి తెలిసిందే. గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం గొల్లప్రోలు పట్టణానికి చెందిన బండి గణేష్, వి.శివాజీ పిఠాపురం పట్టణం రథాలపేటకు చెందిన గుర్రాల రాంబాబు, లచ్చబాబు, శీకోటి ఆకాష్‌లను అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరచనున్నట్టు పోలీసులు తెలిపారు.

క్రికెట్ అసోసియేషన్ నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు

- జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి); ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్‌లో నమోదైన క్రీడాకారులు, శిక్షకులు, అంపైర్లు, స్కోరర్లు అసోసియేషన్ అనుమతి లేకుండా ప్రైవేటు టోర్నమెంట్లలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొంత మంది అసోసియేషన్ అనుమతి లేకుండా ప్రైవేట్ టోర్నమెంట్లలో పాల్గొన్నట్టు తమకు తెలిసిందని, ఇక మీదట ఎవరైనా అలా చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఎవరైనా వ్యక్తిగతంగా అసోసియేషన్‌కి లిఖితపూర్వక దరఖాస్తు చేసుకుని అనుమతి వచ్చిన తర్వాతే టోర్నమెంటల్లో పాల్గొనాలన్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి

డీఆర్‌డీఏ కార్యాలయ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు సకాలంలో అందజేయడంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మండలంలోని బొమ్మూరు వైటీసీ ఆవరణలో డీఆర్‌డీఏ కార్యాలయాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ పేదరిక నిర్మూలన కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థిక చేయూతనిచ్చే స్వయం సహాయక సంఘాల మహిళా సాధికారిత లక్ష్య సాధనతో పాటు వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల కు సత్వరం అందించడంలో డీఆర్‌డీఏ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం వైటీసీ ప్రాగణంలోని డ్వామా, జిల్లా పరిశ్రమలు, జిల్లా పంచాయతీ, మైక్రో ఇరిగే షన్, సమాచార పౌరసంబంధాలు, జిల్లా స్పోర్ట్స్ కార్యాలయాలను సందర్శించి వసతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌బీబీఎస్ మూర్తి, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, అప్పలకొండ, ఎల్‌డీఎం ప్రసాద్, వి.శాంతామణి, శ్రీధర్ రామన్, ఎ.నాగమహేశ్వరరావు, ఐ.కాశయ్య పాల్గొన్నారు.

సాయినాథుడి మందిర వార్షికోత్సవం



బిక్కవోలు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా షిర్డీగా పేరొందిన బలభద్రపురం సాయినాథుడి మందిర వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాగడా హారతి, గణపతి పూజ, హోమం, లక్షపత్రిపూజ, శ్రీరాజరాజేశ్వరిదేవికి లక్ష కుంకుమార్చన, గ్రామోత్సం జరిపారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాబాను దర్శించి క్షీరాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. భక్తులకు బిరియాని ప్రసాదాన్ని అందించినట్టు మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తెలిపారు. బాబాను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జిల్లా నెక్ చైర్మన్ కర్రి వెంకటముకుందరెడ్డి, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి దర్శించుకున్నారు.

మర్రిపూడిలో దివ్యాంగుల క్షేమాభివృద్ధిపై సర్వే



దివ్యాంగుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న బృంద సభ్యులు

రంగంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపూడిలో సోమవారం మండల న్యాయాధికార సేవా సంస్థ సభ్యులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయవాది మడికి రాంబాబు మాట్లాడుతూ పెద్దాపురం 7వ అదనపు జడ్జి జి.చంద్రమౌళేశ్వరి ఆదేశాల మేరకు ఐసీడీఎస్, వైద్యాధికారులు, న్యాయశాఖల నుంచి 14 మంది సభ్యుల బృందం దివ్యాంగుల యోగక్షేమాలను, పింఛన్, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? సదరన్ సర్టిఫికెట్ ఉందా లేదా? వైద్యం ఎక్కడ పొందుతున్నారు అనే అంశాలపై ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించామన్నారు. 8 మంది దివ్యాంగులను గుర్తించామన్నారు. అలాగే స్థానిక జడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం రవికుమార్ అధ్యక్షతన విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను, ఆరోగ్య సమస్యలను వివరించారు. కార్యక్రమంలో సింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.సంకీర్తన, లీగల్ వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్‌ఎంలు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కనీస వేతనం కల్పించాలి

రాజానగరంలో అంగన్‌వాడీ వర్కర్ల ఆందోళన

సీడీపీవో నాగమణికి వినతి



రాజానగరంలో సీడీపీవో నాగమణికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

రాజానగరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న తమకు కనీస వేతనం రూ.26 వేలు కల్పించాలంటూ అంగన్‌వాడీ వర్కర్లు రాజానగరంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు కె.బేబిరాణి మాట్లాడుతూ గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ తక్షణమే జీవో జారీచేయాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల పదోన్నతులకు నిర్దిష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని, ప్రీ స్కూల్స్‌ను బలోపేతం చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీవో టి.నాగమణికి అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్ ఎం.మార్తమ్మ, మండల సెక్రటరీ వైసు జాత, ఎస్ఎఫ్ఐ లీడర్లు ఎన్.రాజా, కె.ఏడుకొండలు పాల్గొన్నారు. అలాగే కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ కొవ్వూరులోను అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన నిర్వహించారు.

బీజేపీ 2వ మండల కమిటీ ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ అసెంబ్లీ పరిధిలోని బీజేపీ 2వ మండల కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఆర్టీసీ కాలనీలో జరిగింది. అధ్యక్షురాలిగా అధికారి లక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఏఎల్‌జీబీ లక్ష్మణరావు, మల్లిడి శ్రీనివాసరెడ్డి, పైబోయిన రాజరాజేశ్వరి, ఆర్‌వీ రాఘవరావు, కొప్పుల శశిధర్, వాసంశెట్టి వెంకట్రావు, ప్రధాన కార్యదర్శులుగా నిడమర్తి వెంకట్, గొయ్య మాధవి, కోశాధికారిగా వైవీపీ వెంకటేశ్వరరావు, మరో ఏడుగురు కార్యదర్శులుగా ప్రమాణస్వీకారం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

దోసాలమ్మకు వెండి కిరీటం బహూకరణ



కొమరిపాలెంలో దోసాలమ్మకు బహూకరించిన వెండి కిరీటంతో దాతలు

బిక్కవోలు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కొమరిపాలెం గ్రామ దేవత దోసాలమ్మకు గ్రామానికి చెందిన బాణాసంచా తయారీదారుడు వెలుగుబంట్ల సత్యనారాయణ దేవతమ్మ దంపతులు మూడు కిలోల వెండి కిరీటాన్ని సోమవారం బహూకరించారు. ముందుగా కిరీటానికి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో వెలుగుబంట్ల వెంకట నరేష్, హరిప్రియ దంపతులు పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం ఈనెల 22న అమ్మవారి జాతర సంద్భంగా గ్రామ పెద్దలు గంగ్రోతు రామకృష్ణ, పడాల సత్యనారాయణ రెడ్డి, కొవ్వూరు సురేష్‌రెడ్డి పందిరి రాట వేసి ఉత్సవ పనులు ప్రారంభించారు.

ఇసుక దోపిడీకి కూటమి ప్రభుత్వమే కారణం

మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇసుక దోపిడీకి కూటమి ప్రభుత్వమే కారణమని మాజీ మంత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా ద్వారా వచ్చే ఆదాయం ఎవ్వరి జేబులోకి వెళ్తుందని ప్రశ్నించారు. పర్యావరణాన్ని రక్షించాల్సిన ప్రభుత్వం ఇసుక అక్రమాలకు పాల్పడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు గడుస్తున్నా ఒక్క పథకం కూడా సజావుగా అమలు చేయలేకపోయారని విమర్శించారు.

సారా తరలిస్తున్న నలుగురి అరెస్టు

గోకవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. మండలంలోని కృష్ణునిపాలెం పరిధిలోని ఇటికాయిలపల్లికి చెందిన నలుగురు వ్యక్తులు మోటారుసైకిళ్లపై సారా తరలిస్తుండగా దాడిచేశామన్నారు. వారిని అరెస్టు చేసి, 2లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

జి.దొంతమూరులో వీరభద్రుడి బోనం

రంగంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.దొంతమూరు గ్రామంలో సోమవారం శ్రీవీరభద్రుని బోనం సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఊరేగింపులో పాల్గొని అనంతరం స్వామి వారిని దర్శించుకొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కడియం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరి జాతీయ రహదారి సమీపంలోని వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం జరిగింది. ఆలయార్చకుల వేదమంత్రాల మధ్య స్వామికి పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చన, సామూహిక సింధూర, తమలపాకు పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, మజ్జిగ, పులిహోర వితరణ చేశారు.

చిన్నారుల కటకట

» అచ్చుతాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో తాగునీటి సమస్య

» ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్న విద్యార్థులు

» ఏడాదిగా పట్టించుకోని అధికారులు



ప్రాథమికోన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

గోకవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్యుతాపురంలో ప్రాథమికోన్నత పాఠశాలలో తాగునీటి ఎద్దడి నెలకొంది. పాఠశాల ప్రాంగణంలో జీఎల్‌ఆర్ ట్యాంకు ఉన్నప్పటికీ నీటి సరఫరా లేక ప్రస్తుతం వృథాగా పడి ఉంది. ట్యాంకుకు నీరు చేరే పైపులు మరమ్మతులకు గురవ్వడం, సుమారు కిలో మీటరు దూరం నుంచి నీటిని సరఫరా చేసే విద్యుత్ మోటారులో తరుచూ ఏదొక సమస్య తలెత్తుతోంది. దీంతో సుమారు ఏడాది నుంచి ఈ ట్యాంకుకు నీటి సరఫరా లేక నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం విద్యార్థుల్లో కొంతమంది ఇళ్ల వద్ద నుంచి తాగునీరు తెచ్చుకొని దప్పిక తీర్చుకుంటుండగా, మరికొంతమంది సమీపంలోని చేతి పంపు నీటిని వినియోగించుకుంటున్నారు. విచిత్రమేమిటంటే పాఠశాలకు ఎదురుగా సచివాలయం ఉన్నప్పటికీ అందులో పనిచేసే ఏ ఒక్క అధికారి ఈ ట్యాంకు పరిస్థితి గురించి పట్టించుకున్న దాఖలేవు.

అధికారులకు తెలియజేసినా..

ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారుగా ఏడాది నుంచి తాగునీటి సమస్య ఉన్నప్పటికీ అధికారులెవ్వరూ పట్టించుకోలేదని మాజీ ఎంపీటీసీ సభ్యుడు నల్లల వెంకన్నబాబు ఆరోపించారు. ట్యాంకుకు మరమ్మతు పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని అనేకమార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ వారి నుంచి స్పందన లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పాఠశాలకు వద్ద ఉన్న సచివాలయం సిబ్బందిలో కూడా చలనం కనిపించలేదన్నారు. తాగునీటి కోసం విద్యార్థులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అచ్యుతాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని వెంకన్నబాబుతోపాటు గ్రామస్థులు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారం రీసర్వే : జేసీ



ఖండవల్లిలో రీ సర్వేపై సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ చినరాముడు

ఉండ్రాజవరం/ పెరవలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ రీ సర్వేలు నిబంధనల ప్రకారం జరగాలని జేసీ చినరాముడు పేర్కొన్నారు. సోమవారం పెరవలి మండలం ఖండవల్లిలో జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే ఖచ్చితంగా జరగాలన్నారు. భూముల సరిహద్దు వివాదాలు లేకుండా నిబంధనల ప్రకారం చేయాలన్నారు. దీనిలో భాగంగా సర్వే రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహశీల్దార్ అచ్యుతకుమారి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలులో మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

బిక్కవోలు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు కమిటీ అధ్యక్షుడు వంగా రామకృష్ణారెడ్డి సోమవారం రాట ముహూర్తం చేసి ఉత్సవ పనులను ప్రారంభించారు. ఈనెల 26న మహాశివరాత్రి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు, పల్లి రాజారెడ్డి, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు ఈసీసీఈపై శిక్షణ

రాజానగరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు ఈ నెల 18 నుంచి ఆరు రోజుల పాటు ఎర్లీ చైల్డ్‌హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్(ఈసీసీఈ)పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్ సోమవారం తెలిపారు. చిన్నారుల్లో విద్యా ప్రమాణాల పెరుగుదల, మానసిక, శారీరక దారుడ్యం, ఆహ్లాదకరమైన విద్య అందించేందుకు ఫౌండేషనల్ లిటరెసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) స్థాయిలో భాషా ప్రమాణాలు రూపొందించేందుకు ఈ నెల 18 నుంచి 25వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు రాజానగరంలోని జడ్పీ హైస్కూల్లో ఈశిక్షణ కార్యక్రమం జరుగుతుంద ఎంఈవోలు పేర్కొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



రంగంపేటలో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న డీస్పీ విద్య

రంగంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరుగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లను ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. డీఎస్పీ వెంట స్థానిక సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదకర ఘాట్లలో స్నానాలు నిషేధం

» గజ ఈతగాళ్లు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలి

» మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్

» మహాశిరాత్రి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదకర ఘాట్లలో స్నానాలను నిషేధించాలని, భక్తులు వాటి వైపు వెళ్లకుండా బారికేడింగ్ చేయాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 26న మహాశివరాత్రి సందర్భంగా గోదావరి స్నానాలు చేసేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని స్నానాల రేవులన్నీ శు భ్రం చేయాలని, అవసరమైన చోట్ల రేవుల్లో ఇసుక వేయాలని, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి ఘాట్‌లో రెం డు షిఫ్టులలో గజ ఈతగాళ్లను ఈ నెల 25వ తేదీ సాయంత్రం నుంచి 26వ తేదీ సాయంత్రం వరకు రేవుల్లో అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళలు దు స్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలని, నీటిలో దిగలేని పిల్లలు పైనే స్నానం చేసేలా షవర్ బాత్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కరాలరేవు, కోటిలింగాల రేవుల్లో ఫైరింజన్, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని శాఖల సిబ్బందితో కంట్రోల్ రూమ్ ఏర్పా టు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమ సిబ్బందికి నిర్వహించాల్సిన విధులను తెలియజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కమిషనర్ అన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎస్ఈ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్‌బీ గణేశ్వరరావు, త్రీటౌన్ సీఐ వి.అప్పారావు, టూటౌన్ సీఐ కె.మంగాదేవి, వన్‌టౌన్ సీఐ కేశవరావు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపిద్దాం

న్యాయవాదులను ఓట్లు అభ్యర్థించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి



న్యాయవాదులకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్య ఓటువేసి పట్టం కడదామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక బార్ అసోసియేషన్ హాలులో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేరాబత్తుల రాజశేఖరం మంచి ఆలోచనపరుడని, నిరుద్యోగుల సమస్యపట్ల గళం వినిపిస్తారని ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే పట్టభద్రుల ప్రయోజనాలను కాపాడుతారన్నారు. నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తారని చెప్పారు. 2023లో టీడీపీ గెలిచిన మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేశాయన్నారు. అలాగే రాజశేఖరం గెలుపునకు సహకరించాలని న్యాయవాదులను కోరారు.

బిక్కవోలు: తొస్సిపూడిలో కూటమి నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఇందల వీరబాబు, కర్రి శ్రీను, తేతలి వెంకటరెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మునిసిపల్' వేతనాల చెల్లింపు ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వొద్దు

వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు



అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న తాటిపాక మధు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్ర జ్యోతి): మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని జిల్లా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరం కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సంగిరెడ్డితో కలిసి మాట్లాడారు. పారిశుధ్య, ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌లో ఎన్కామెంట్, మూడు డీఏలు సత్వరం విడుదల చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు అగ్రిమెంట్ మేరకు పెంచాలని డిమాండ్ చేశారు. 15ఏళ్లుగా స్కూల్ స్వీపర్ల వేతనాలు పెంచలేదని సత్వరమే పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62ఏళ్లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.రమణ, దానాల దుర్గమ్మ, వెంకటేశ్వరరావు, పోలమ్మ, మురళీ, వెంకటగిరి, శ్రామిక మహిళ ఫోరం నాయకులు పి.లావణ్య పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలి



ఏడీఏకు వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

కోరుకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న ఖరీఫ్ ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కోరుకొండ సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. కోరుకొండ మండలానికి సంబంధించి సుమారు ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉండిపోయిందన్నారు. తక్షణం కొనుగోలుచేయాలని వైసీపీ రైతు విభాగం నాయకులు తోరాటి శ్రీను, నేతుల చిన్ని, మండల కో ఆప్షన్ మెంబర్ గొల్లపల్లి ప్రవీణ్, చిక్కిరెడ్డి దుర్గాభాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బంది లేకుండా రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేపట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల వద్ద మిగిలిన 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి అవకాశం కల్పించాలని వారు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల గోరక్షణపేట సెంటర్ వద్ద జరిగిన ప్రమాదంలో మరణించిన విజయన రూపస్ కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక వీవీ గార్డెన్స్‌లోని రూపస్ నివాసానికి వెళ్లి అతడి తల్లిదండ్రులను పరామర్శించి తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. విజయ్ కుటుంబానికి కాంట్రాక్టర్ రూ.7 లక్షలు ఇచ్చారని కాని దానితో ప్రాణాలను పోల్చలేమని ఇది దురదృష్టకరమైన సంఘటన అని అన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రయత్నించాలే తప్ప ఇటువంటి సమయంలో రాజకీయాలు చేయాలనుకోవడం సరికాదన్నారు. విజయ్ చెల్లిని చదివించే బాధ్యత తీసుకుంటామని, సోదరుడికి మంచి ఉద్యోగం వేయిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యాళ్ల ప్రదీప్, కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, ఉప్పులూరి జానకిరామయ్య, మొకమాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం అందిస్తాం

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



మహిళా ప్రత్యేక జైలులో ఆహారాన్ని రుచి చూస్తున్న శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నిబంధనలు అనుసరించి ఖైదీలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీ లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కేంద్ర, మహిళా ప్రత్యేక కారాగారాలను ఆమె సందర్శించి ఖైదీలకు అందజేస్తున్న ఆహార సదుపాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడుతూ వారి తరఫున ఉచితంగా కోర్టుల్లో వాదించడానికి ఉచితంగా న్యాయవాదుల ఏర్పాటు, బెయిల్ దరఖాస్తుల దాఖలు, హైకోర్టుల్లో అప్పీలు చేయడం తదితర న్యాయ సహాయం విషయంలో డీఎల్ఎస్ఏ సహకరిస్తుందన్నారు. డీఎల్ఎస్ఏ నియమించిన పారా లీగల్ వలంటీర్ల ద్వారా తమ అర్జీలను అందించాన్నారు. నిందితులు, ఖైదీల గురించి పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

బీఎంపీ అసోసియేషన్ సమావేశం



వైద్యనిపుణుడిని సత్కరిస్తున్న అసోసియేషన్

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ది ఏపీ స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక ఏవీ అప్పారావు రోడ్‌లోని శ్రీకర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రాంగణంలో జరిగింది. ఆసుపత్రి అధినేత రోబోటిక్ సర్జన్ డాక్టర్ అఖిల్ దాడి రోబోటిక్ సర్జరీపై అవగాహన కల్పించారు. డాక్టర్ జి.రోహిత్‌కుమార్, డాక్టర్ ఎన్‌జే పృథ్వీకృష్ణ సభ్యులకు వైద్య విజ్ఞానం అందించారు. రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షుడు ఎస్కే ఇమామ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొమ్మా శ్రీనివాసరావు, ఎంవీవీ సత్యనారాయణ, దబ్బాడ రాంబాబు, అంజిబాబు మనోహర్, టి.రామాంజనేయులు, వి.బాలకృష్ణ, వి.ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు ప్రమాదాలు..ముగ్గురి మృతి

రోడ్డుపై మనం జాగ్రత్తగా వెళుతున్నా ఎదురుగానో.. వెనుకనో వచ్చే వారు జాగ్రత్తగా రాకపోతే ప్రమాదమే.. సోమవారం జిల్లాలో జరిగిన రెండు ప్రమాదాలే అందుకు నిదర్శనం. దివాన్‌చెరువులో వెనుక నుంచి టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో తోడికోడళ్లు మృతిచెందగా.. కడియం మండలం దుళ్ల మడికి రోడ్డులో ఎదురుగా బైక్‌పై వచ్చిన యువకులు దంపతులు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొనడంతో భర్త మృతిచెందాడు. - 8లో

లే..ఔట్!



ఇదీ వెలుగుబంద లేఅవుట్.. ఊరికి దూరంగా అడవిలో ఉంటుంది. ఈ కాలనీకి రావాలంటే గగనమే.. ఈ కాలనీలో రాజమహేంద్రవరం నగర ప్రజలకు స్థలాలు కేటాయించడం గమనార్హం.

నివాసయోగ్యం కాకపోతే రద్దు

- పేదల ఇళ్ల లేఅవుట్లపై ఆరా
- నివేదిక కోరిన కలెక్టర్‌ప్రశాంతి
- డిప్యూటీ తహశీల్దార్లకు బాధ్యత
- వారంలో ఇవ్వాలని ఆదేశం
- పేదింటికి వైసీపీ శాపం
- మధ్యలో ఆగిన వేలాది ఇళ్లు
- లోపభూయిష్టంగా లేఅవుట్లు
- పల్లపు లేఅవుట్లుపై దృష్టి
- ఇళ్లు కట్టిస్తున్న కూటమి
- అధికారులకు టార్గెట్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

స్థలాలు ఇచ్చేశాం.. ఇళ్లు కట్టుకోవడమే తరువాయి అంటూ నాడు వైసీపీ నాయకులు హడావుడి చేశారు..అయితే ఆ స్థలాలను చూసి పేదలు మాకొద్దు బాబోయ్ అంటూ గగ్గోలు పెట్టారు.జిల్లాలో చూస్తే దేవరపల్లి,గోపాలపురం, రాజమహేంద్రవరం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు నియోజకవర్గాల్లో ఆ పరిస్థితి ఉంది.అయినా మార్పులేదు.. కట్టుకుంటే కట్టుకోండి.. లేదంటే పట్టా రద్దు చేస్తాం అంటూ భయపెట్టినా ఫలితం లేకపోయింది. అయితే ప్రభుత్వం మారడంతో నాడు లేఅవుట్ల పరిస్థితిపై కూటమి ప్రభుత్వం ఆరా తీస్తోంది.. జిల్లాలో లేఅవుట్లు, వాటి పరిస్థితిపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి డిప్యూటీ తహశీల్దార్లకు ఆదేశించారు.ఇప్పటికే ప్రభుత్వం కూడా నివా సయోగ్యం కాని లేఅవుట్లను రద్దు చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.

గత వైసీపీలో నిరాశే..

గత వైసీపీ ప్రభుత్వంలో అనేక చోట్ల నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేశారు. 429 లేఅవుట్లు వేసి 47,053 మందికి స్థలాలు కేటాయించారు.తక్కువ ధర ఉండే భూము లను ఎక్కువ ధరకు కొనుగోలు చేసి రూ.కోట్లలో కుంభకోణానికి పాల్పడిన సంగతి తెలిసిందే.దానికి ఉదాహరణే రాజమహేంద్ర వరం నగర ప్రజలకు బూరుగుపూడిలో కేటాయించిన ఆవ భూములు. కొన్ని స్థలాల ఫిల్లింగ్ పేరుతో వైసీపీ నేతలు మట్టినీ తవ్వేసి అమ్మేసుకున్న ఘటనలూ ఉన్నాయి.లేఅవుట్లలో పేదలకు ఇళ్లు పూర్తిగా నిర్మించలేదు కానీ వారి పేరుతో వైసీపీ నేతలు మట్టి, గ్రావెల్ ,భూమి కొనుగోలులో అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు గడించారు. అప్పట్లో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలపై జగన్ బొమ్మకూడా వేసుకుని విస్తృత ప్రచారం చేసుకున్నారు. చివరిలో వైసీపీ నాయకులు ఓట్ల రాజకీయం చేశారు.అనపర్తిలో దొంగ ఇళ్ల పట్టాలు సృష్టించి ఇచ్చే ప్రయత్నం చేశారు. అప్పట్లో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. రాజమహేంద్రవరంలో అయితే స్థలాలు చూపించకుండా పట్టాలు ఇచ్చేశారు. తమకంటూ సొంత గూడు ఏర్పడుతుందని ఆశపడిన పేదలకు నాడు నిరాశే మిగిలింది.

అర్హులెవరు..అనర్హులెవరు?

జిల్లాలో ఇళ్లు , ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులపై కూటమి ప్రభుత్వం సర్వే చేస్తుంది. ఇంటి పట్టా ఇచ్చారా ఎక్కడ ఇచ్చారు. స్థలం చూపించారా,ఇల్లు కట్టుకున్నారా, కట్టుకోకపోతే కారణం ఏంటి.. పట్టా ఇచ్చి కూడా స్థలం చూపించలేని పరిస్థితి ఉందా వంటి అంశాలపై సర్వే జరుగుతుండడం గమనార్హం. ఇదిలా ఉండగా రెవెన్యూ ఉద్యోగులతో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకూ నాడు ఇళ్ల పట్టాలు.. నిర్మాణాలకు అనుమతిపొందిన లబ్ధిదారుల్లో అర్హులు.. అనర్హుల లెక్క తేల్చారు.

జిల్లాలో 429 లేఅవుట్లు..

జిల్లావ్యాప్తంగా 429 లేఅవుట్లలో 47,053 మందికి స్థలాలు కేటాయించారు. అందులో నివాసయోగ్యం కాని 61 లేఅవుట్లు ఖాళీగా ఉన్నాయి. కేవలం 1 నుంచి 10 ఇళ్ల వరకూ మొదలెట్టినవి 146, 11 నుంచి 50 ఇళ్ల వర కూ మొదలెట్టినవి 144 ఉన్నాయి. 51 నుంచి 100 వరకూ మొదలెట్టినవి 46 లేఅవుట్లు, 101 నుంచి 300 వరకూ నిర్మించినవి 20 లేఅవుట్లు, 301 నుంచి 500 ఇళ్లవరకూ మొదలెట్టినవి 4 లేఅవుట్లు ఉన్నాయి. 5001 నుంచి 1000లోపు ఇళ్లు మొదలెట్టినవి 5, వెయ్యికి పైగా మొదలెట్టినవి 3 లేఅవుట్లు ఉన్నాయి. ప్రభుత్వం నివేదిక వచ్చిన తర్వాత ఈ లేఅవుట్లలో బాగున్న వాటిని కొనసాగించి మిగతావాటిని ప్రభుత్వం రద్దు చేసే అవకాశం ఉంది. లబ్ధిదారులకు కొత్తగా స్థలాలను మంజూరు చేయనుంది.



ఇళ్ల కేటాయింపులు ఇలా..

మండలం	లక్ష్యం	ఇళ్లు
దేవరపల్లి	146	46
రాజానగరం	83	21
గోకవరం	45	11
గోపాలపురం	112	27
కడియం	51	12
నల్లజర్ల	182	39
నిడదవోలు	104	18
కోరుకొండ	82	12
తాళ్లపూడి	105	14
ఉండ్రాజవరం	109	13
నిడదవోలు అర్బన్	87	10
రాజమండ్రి రూరల్	111	11
బిక్కవోలు	236	23
రంగంపేట	165	14
కొవ్వూరు అర్బన్	423	27
అనపర్తి	238	14
పెరవలి	56	3
చాగల్లు	213	11
కొవ్వూరు	217	11
సీతానగరం	122	6

పేదలకు కూటమి అండ

జిల్లాలో సొంతంగా ఇళ్లు కట్టుకోలేని పరిస్థితిలో ఉన్న పేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచి వాటిని కట్టి లబ్ధిదారులకు అప్పగించే ప్రయత్నంలో ఉంది.జిల్లాలో 3,823 మంది లబ్ధిదారులకు గతంలో మంజూరు చేసిన రూ.1.80 లక్షలతోనే ఇంటిని నిర్మిస్తుంది. మార్చి నెలాఖరుకు పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు.100 రోజుల కార్యక్రమం కింద ఈ ఇళ్లను పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంతి అధి కారులకు టార్గెట్ ఇచ్చారు.జిల్లా మొత్తం మీద 3823 ఇళ్ల నిర్మాణం లక్ష్యం 717 పూర్తి చేశారు. జిల్లా టార్గెట్‌కు సంబంధించి వెలుగుబంద కాలనీలోనే 936 ఉన్నాయి.ఇప్పటికే 374 పూర్తి చేశారు.43 రోజుల్లో 526 పూర్తి చేయాలి. రోజు కు 13 ఇళ్లు నిర్మించాలనే టార్గెట్ పెట్టారు. కానీ ఇక్కడ ఓ సమస్య ఉంది. సుమారు 120 మంది లబ్ధిదారుల వివరాలు తెలియడం లేదు. వాళ్ల అడ్రస్‌లు,ఫోన్ నెంబర్లు కూడా అందుబాటులో లేవు. అధికారులు ఇబ్బంది పడు తున్నారు.



అ..టెన్షన్!

రాజమహేంద్రవరం పెద్దాసుపత్రికి రెండు అనుమానిత కేసులు

- 3 రోజుల కిందట రోగులు
- కాకినాడకు తరలింపు
- వైద్యులు లేకపోవడమే కారణం
- ఒకరికి నిర్ధారణ కాని వైనం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) రాజమహేంద్రవరం ప్రజలను వణికిస్తోంది. పెద్దాసుపత్రికి మూడు రోజుల కిందట రెండు అనుమానిత కేసులు రావడంతో వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి నిర్ధారణకు కాకినాడ జీజీహెచ్‌కు పంపించారు. వీరిలో ఒకరికి జీబీఎస్ సోకలేదని తేలిందని సమాచారం. మరొకరికి సంబంధించి నిర్ధారణ రావాల్సి ఉందని చెబుతున్నారు. జీబీఎస్‌కు సంబంధించి ప్రాథమికంగా జనరల్ మెడిసిన్ వైద్యులు, న్యూరో విభాగం వైద్యులు పరీక్ష చేయాల్సి ఉంటుంది. రాజమహేంద్రవరం జీటీజీహెచ్‌లో జనరల్ మెడిసిన్‌లో వైద్యులు ఉన్నా న్యూరో విభాగానికి సంబంధించి ఇంకా పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదు. న్యూరో ఫిజీషియన్, న్యూరో సర్జన్ మాత్రమే ఉన్నారు. జీబీఎస్‌ను నిర్ధారించే పరీక్షలు, పరికరాలు ఇక్కడ అందుబాటులో లేవు. దీంతో ఏ అనుమానిత కేసు వచ్చినా కాకినాడ రిఫర్ చేయడం తప్ప మరో మార్గం లేదు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ నిర్ధారణ పరీక్షలు చేసే ఎక్విప్‌మెంట్ ఇక్కడ లేదని, అందువల్లే కాకినాడ పంపుతున్నామని..అయినా జీబీఎస్ అనుమానిత కేసులకు ఆసుపత్రిలో ఏర్పాట్లుచేస్తున్నామని వెల్లడించారు.ప్రత్యేకంగా రెండు బెడ్స్‌తో ఒక గది సిద్ధం చేస్తున్నామన్నారు.



సన్‌రైజర్స్ రైడింగ్ క్లబ్‌కు షీల్డు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో డీటీవో తదితరులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు చేపట్టిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు - 2025 ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు.దీనిలో భాగంగా ఆమె మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం విలువైనది అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. రహదారి భద్రత నియమాలు పాటిస్తున్నామా లేదా అనే దానిపై ఎవరికి వారే స్వీయ ఆలోచన చేసుకోవాలని డీటీవో ఆర్.సురేష్ అన్నారు. వక్తృత్వం, వ్యాసరచన, తదితర పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. సన్‌రైజర్స్ రైడింగ్ క్లబ్‌కు షీల్డు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐలు సీహెచ్ సంపత్‌కుమార్,ఎం.రవికుమార్,జి.రాంనారాయణ్, ఏఎంవీఐలు,ఉద్యోగులు,విద్యార్థులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బోట్స్‌మెన్ సొసైటీల సభ్యులు

ఇసుక పరిమితికి మించితే కేసులే

- భద్రత ప్రమాణాలు పాటించాలి
- నిబంధనలు మీరితే జరిమానా
- ఇసుక కమిటీ సమీక్షలో కలెక్టర్
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

రాజమహేంద్రవరం/సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణా సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించకపోతే కేసులు తప్పవని కలెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు. ఇసుక రవాణా సమయంలో నిబంధనలను బేఖాతరు చేయడంతో లారీల్లోని ఇసుక రోడ్డుపై పడుతూ ప్రమాదాలకు కారణం కావడంపై 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 15న 'ఇసుక రోడ్లు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సోమవారం తన అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో తగు ఆదేశాలు ఇచ్చారు. అధిక లోడు, భద్రతా ప్రమాణాలు పాటించని ఇసుక రవాణా లారీలపై నిఘా ముమ్మరం చేస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలు చేసి జరిమానాలు రాయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ విషయానికి సంబంధించిన కమిటీ నిర్ణయాన్ని మినిట్స్ బుక్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇసుక రవాణా లారీల విషయంలో ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయన్నారు. వాటికి సంబంధించి బాధ్యులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఇక, జిల్లాలో 15 ఓపెన్ ఇసుక రేవుల్లో నిర్దేశించుకున్న 10,39,350 మెట్రిక్ టన్నులకు సంబంధించి 7,35,766 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. సింగవరం , కాటవరంలలో మార్చి 4న, కుమారదేవం మార్చి 5న పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తామన్నారు. కొత్తగా కడియం, పెరవలి, తీపర్రులో రెండు, నిడదవోలులో జీడిగుంట ఏ,బి, పందలపర్రు డ్రాఫ్ట్ మైనింగ్ ప్లాన్ ఆమోదించడం జరిగిందని కలెక్టర్ అధికారులకు సూచించారు. రీచ్‌ల సమీపంలో రహదారుల బాధ్యతను ఏజెన్సీలే చేపట్టాలన్నారు.సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్‌డీవో ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్ రెడ్డి, ఇరిగేషన్ సీఈ కె.నరసింహమూర్తి పాల్గొన్నారు.

డ్రెడ్జింగ్ ఆపాలని ధర్నా

ఉభయగోదావరి జిల్లాల్లో గోదావరిలో డ్రెడ్జింగ్ యంత్రాలతో ఇసుకను అక్ర మంగా తోడేయడం వల్ల 10 వేల మంది బో ట్స్‌మెన్ సొసైటీలు రోడ్డున పడ్డారని జైభీమ్ దళిత ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు చోళ్ళ రాజువాపోయారు. న్యాయం చేయాలని ఆయా సొసైటీల సభ్యులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. డ్రెడ్జింగ్ యంత్రాల కారణంగా ఇసుక తీత కార్మికులు ఉపాధి పోయిందన్నారు. డ్రెడ్జింగ్ వల్ల గోదావరి నదిపై ఉన్న బ్రిడ్జిల మనుగడ ప్రమాదమన్నారు. వెంటనే డ్రెడ్జింగ్ నిలుపుదల చేసి ఇసుక తీత పనులు చేసుకునే సొసైటీలకు పనులు కల్పించాలన్నారు.తక్షణమే కలెక్టర్ చర్యలు తీసుకుని డ్రెడ్జింగ్ నిలుపుదల చేయించాలని కోరారు.కార్యక్ర మ ంలో లేబర్ యూనియన్ నాయకులు వారా ప్రభాకర్, దేవన వెంకట కృష్ణ,శ్రీకృష్ణ దేవరాయలు, బోట్స్‌మెన్ సొసైటీల నాయకులు పాల్గొన్నారు.



అంగన్ వాడీ!

అంగన్‌వాడీల ఉద్యమం మళ్లీ వేడెక్కింది.. తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం నిరసన ప్రదర్శన చేశారు.. రాజానగరం, కొవ్వూరులో నేలపై బైఠాయించి నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం హామీల అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 8

తునిలో.. వై..చీప్ ట్రిక్స్!



తుని మునిసిపల్ కార్యాలయ భవనం

తుని వైస్ చైర్మన్ ఎన్నికలో వైసీపీ డ్రామాలు

- వైసీపీ కౌన్సిలర్లు గైర్హాజరు
- ఇప్పటికే మూడుసార్లు వాయిదా
- పాగాకు వైసీపీ.. టీడీపీ పట్టు
- టీడీపీలో 10 మంది ఫ్యాన్ కౌన్సిలర్లు
- మిగిలిన 17 మంది ఎటువైపో..
- ఆందోళనలో వైసీపీ నాయకులు
- ఎన్నికకు హాజరుకాకుండా నిర్బంధం
- చైర్‌పర్సన్ ఇంట్లో బంధించిన రాజా
- నేడు నాలుగోసారి ఎన్నిక
- కోరం లేక.. రెండుసార్లే వాయిదా
- తరువాత కోరం అవసరమేలేదు

కాకినాడ/తునిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని తుని మునిసిపాలిటీలో వైస్‌చైర్మన్ ఎన్నిక వ్యవహారం రకరకాల మలుపులు తిరుగుతోంది. ఎలాగైనా ఈ కుర్చీలో పాగా వేయాలని టీడీపీ, మిగిలిన సభ్యులు చేజారిపోకుండా కాపాడుకోవాలని వైసీపీ ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. దీంతో కోరం లేక సోమవారం జరగాల్సిన ఎన్నిక మూడోసారీ రద్దయింది. తిరిగి మంగళవారం నాలుగోసారి ఎన్నిక నిర్వహించనున్నారు. ఈసారి కూడా మళ్లీ కోరం డ్రామా కొనసాగుతుందా? లేదంటే ఎన్నిక జరుగుతుందా? అనేది సస్పెన్స్‌గా మారింది. ఈ ఎన్నిక ఎలాగైనా నిర్వహించాలని హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ ఎన్నికకు హాజరుకాకుండా వ్యవహరిస్తుండడం విశేషం.

మూడోసారీ అదే డ్రామా..

తుని మునిసిపాలిటీ వైస్‌చైర్మన్ ఎన్నిక మూడోసారి సోమవారం జరుగుతుందని అంతా భావించారు. కుర్చీ ఏ పార్టీ ఖాతాలో పడుతుందోనని రకరకాల లెక్కలు వేశారు. తీరా యథావిధిగా కోరంలేకపోవడంతో ఎన్నిక రద్దయింది. దీంతో అంతా ఉసూరుమనాల్సిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఉదయం 11 గంటలకు ఎన్నిక నేపథ్యంలో ఇటీవల వైసీపీని వీడి టీడీపీలో చేరిన 10 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. దీంతో టీడీపీవైపు పూర్తి హాజరు ఉంది. వైసీపీ నుంచి 17 మంది కౌన్సిలర్లు హాజరవుతారని అధికారులు భావించారు. కానీ సమయం మించిపోతున్నా వైసీపీ కౌన్సిలర్లు మాత్రం రాలేదు. వైసీపీకి చెందిన మునిసిపల్ చైర్‌పర్సన్ తన నివాసంలో వీరందరినీ దాచేయడంతో వీరంతా ఎన్నికకు రాలేని పరిస్థితి. మరోపక్క మాజీ మంత్రి దాడి శెట్టి రాజా సైతం సోమవారం నాటి ఎన్నిక వాయిదా పడేలా ముందు నుంచీ కథ నడిపారు. అక్కడకు తుని పట్టణ వ్యాప్తంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను రాజా మోహరించారు. టీడీపీ నుంచి ప్రతిఘటన వస్తే ఎదుర్కొనేందుకు వీలుగా వారిని గొడవకు సిద్ధంచేశారు. అదే సమయంలో టీడీపీ నేతలు చైర్‌పర్సన్ నివాసానికి సమీపానికి వచ్చి ఆందోళన చేపట్టారు. ఎన్నిక జరగకుండా రాజా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కౌన్సిలర్లను స్వేచ్ఛగా సమావేశానికి రానీయకుండా ఓటమి భయంతో నిర్బంధించారని మండిపడ్డారు. దీంతో రాజా, ఆయన అనుచరులు టీడీపీ నేతలతో గొడవకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. దీంతో ఉద్రిక్తతకు దారితీసింది. అటు గొడవను కట్టడి చేయడానికి ప్రయత్నించిన పోలీ సులపై రాజా దురుసుగా వ్యవహరించారు. టీడీపీకి అనుకూలంగా పోలీసులు ఉన్నారంటూ వారిపైకి గొడవకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వేచిచూసిన అధికారులు సగం మంది సభ్యులైన 15 మంది కూడా లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

వైసీపీ ప్రస్తుత వ్యూహం.. కూటమికే ప్రయోజనం?

నిబంధనల ప్రకారం మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి కోరం లేకపోతే రెండుసార్లు మాత్రమే ఎన్నిక వాయిదా వేయొచ్చు. ఆ తర్వాత కోరంతో సంబంధం లేకుండా ఎంతమంది సభ్యులు ఎన్నికకు హాజరైతే వారితోనే ఎన్నిక ప్రక్రియ నిర్వహించేందుకు అవకాశం ఉంది. ఇప్పటివరకు మూడుసార్లు ఎన్నిక రద్దవగా, అందులో రెండుసార్లు శాంతిభద్రతల సమస్య కారణంగా వాయిదా వేశామని, సోమవారం మాత్రమే కోరం లేని కారణంగా ఎన్నిక రద్దయిందని అధికారులు చెబుతున్నారు. మంగళవారం ఇదే కారణంతో ఎన్నిక వాయిదా వేస్తే ఆ తర్వాత మాత్రం హాజరైన సభ్యులతో ఎన్నిక నిర్వహించవచ్చు. మంగళవారం ఎన్నికకు టీడీపీ నుంచి 10 మంది కౌన్సిలర్లు హాజరవుతారు. మరో నలుగురు కౌన్సిలర్లు హాజరైతే తగిన కోరంతో ఎన్నిక జరపవచ్చు.

నేడైనా తేలేనా..

తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక తిరిగి నేడు (మంగళవారం) నాలుగోసారి జరగనుంది. ఈ మేరకు ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. అయితే సోమవారం నాటి ఆందోళనల నేపథ్యంలో మంగళవారం సైతం పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడ జిల్లా నలుమూలల నుంచి బలగాలను దించుతున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.తునిలో మంగళవారం జనం గుమిగూడడం, ఆయుధాలతో సంచరించడాన్ని నిషేధిస్తూ కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు జారీ చేశారు. మరోపక్క తమ కౌన్సిలర్లను ఎన్నికకు హాజరుకాకుండా అడ్డుకుంటున్న వైసీపీ తిరిగి మంగళవారం ఎన్నిక నేప థ్యంలో చలో తునికి పిలుపునివ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే 10 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోవడం, మరికొందరు అదే దారిలో ఉండడంతో ఓడిపోతామనే భయంతో ఎన్నిక జరగకుండా ఎలాగైనా చూడాలని వైసీపీ భావిస్తోంది. ఈ వైసీపీ తీరునే టీడీపీ తప్పుబడుతోంది.



తుని మునిసిపల్ కార్యాలయం వద్ద టీడీపీ కౌన్సిలర్లను కౌన్సిల్ హాల్‌లోకి పంపుతున్న పోలీసులు

'చలో తుని'కి అనుమతి లేదు..

చలో తునికి ప్రభుత్వపరంగా ఎటువంటి అనుమతులు లేవు. చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. సోమవారం జరగాల్సిన ఎన్నిక కోరం సరిపోకపోవడంతో మంగళవారానికి వాయిదా పడింది. కౌన్సిలర్లకు కావాల్సిన పోలీసు రక్షణ ఉంటుంది. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ముందుకు రావాలి. - శ్రీహరిరాజు, పెద్దాపురం డీఎస్పీ



చైర్మన్ నివాసం వద్ద టీడీపీ నాయకులతో మాజీ మంత్రి రాజా వాగ్వాదం

మాజీ మంత్రి రాజాపై కేసు

మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆయన అనుచరులపై కేసు నమోదు చేసినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ స్పష్టంచేశారు. తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నికలో కౌన్సిలర్లు ఓటు వేయకుండా అడ్డుకోవడంతో పాటుగా టీడీపీ నేత పోలిశెట్టి రామలింగేశ్వరరావుపై మాజీ మంత్రి దాడిశెట్టి రాజా దాడి చేయడంపై వచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. వైస్ చైర్మన్ ఎన్నికకు కౌన్సిలర్లు స్వచ్ఛందంగా ఓటు వేసేందుకు ముందుకు రావాలని, పోలీసు రక్షణ అవసరమైతే తుని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

కొవ్వూరు

ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా

● సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



కొవ్వూరులో ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కొవ్వూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సీహెచ్ పుష్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ గత సీఎం జగన్మోహనరెడ్డి అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని గుర్తు చేశారు. ఇకనైనా ప్రస్తుత ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రాట్యుటీ, వేతనాలపెంపు, రెండు సంవత్సరాలుగా నిలిచిపోయిన టీఏ, ఈవెంట్ బిల్లులను తక్షణం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సీహెచ్ మాణిక్యాంబ, సీహెచ్ పుష్ప, వీ. శ్రీదేవి, ఎస్. శాంతకుమారి, నరసింహంబ, సీహెచ్ బ్రహ్మమ్మ, విజయకుమారి, భవాని, సుశీల, లక్ష్మి, సుజాత, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



పెరవలి ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

ఉండ్రాజవరం / పెరవలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని పెరవలి ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు పేర్కొన్నారు. సీఐటీయూ పిలుపు మేరకు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీవో లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అసోసియేషన్ అధ్యక్షురాలు కె. లక్ష్మీకుమారి, కార్యదర్శి కె. కృష్ణవేణి, నాయకులు ఎస్. రంగనాయకమ్మ, విక్టోరియారాణి, కె. లక్ష్మి, పి. విజయనిర్మల, కె. సూర్యకాంతం, కె. లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

విప్లవ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలి



సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 23వ తేదీన జరగనున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రెండు విప్లవ పార్టీల విలీన సభను ప్రజలు, ప్రజాస్వామికవాదులు విజయవంతం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక పిలుపునిచ్చారు. సోమవారం పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో విలీనసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మల్లిక మాట్లాడుతూ శ్రామికవర్గ ప్రజల ప్రయోజనాలు, దేశసమాజ పరిరక్షణ కోసం దేశభక్తులైన కమ్యూనిస్టు పార్టీలు అన్ని ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో ఎం.రత్న, మసీందర్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

గోపాలపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం సీడీపీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీవోకి అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నరేష్ కుటుంబానికి అండగా ఉంటాం

● రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ హామీ



విద్యుత్‌శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన దేశా బత్తుల నరేష్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. సోమవారం నిడదవోలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న నరేష్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. తక్షణ సాయం కింద రూ. పదివేల నగదును అందించారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మృతుని కుటుంబానికి రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. ఆయన వెంట జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగారమేష్, మృతుని కుటుంబ సభ్యులు, సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు, తదితరులు ఉన్నారు.

నిబంధనల ప్రకారం రీ సర్వే : జేసీ



ఖండవల్లిలో రీ సర్వేపై సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ చినరాముడు

ఉండ్రాజవరం/ పెరవలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ రీ సర్వేలు నిబంధనల ప్రకారం జరగాలని జేసీ చినరాముడు పేర్కొన్నారు. సోమవారం పెరవలి మండలం ఖండవల్లిలో జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే ఖచ్చితంగా జరగాలన్నారు. భూముల సరిహద్దు వివాదాలు లేకుండా నిబంధనల ప్రకారం చేయాలన్నారు. దీనిలో భాగంగా సర్వే రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహశీల్దార్ అచ్యుతకుమారి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెరవలి విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 జే ఎక్స్‌టెన్షన్ పనుల కారణంగా మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్‌సరఫరాను నిలిపివేస్తున్నట్టు నిడదవోలు విద్యుత్‌శాఖ ఈఈ ఎన్. నారాయణ అప్పారావు తెలిపారు. పెరవలి, కాకరపర్రు, ముక్కామల, తీపర్రు, ఖండవల్లి, మల్లేశ్వరం ఫీడర్లకు సరఫరా ఉండదన్నారు.

కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలి : ఎమ్మెల్యే



చాగల్లులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, ఫిబ్రవరి 17, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరాన్ని మనమంతా గెలిపించాలని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, సచివాలయాలు, పంచాయతీల్లోని ఉద్యోగులను కలిసి ఓటును అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, కూటమి నేతలు కొఠారు అశోక్‌బాబా, తాళ్ళూరి ప్రసాద్, నందిగం శ్రీను, ఈడుపుగంటి మురళి, బొల్లిన శివనాగేంద్ర, తాళ్ళూరి శ్రీనివాసరావు, గారాపాటి శ్రీనివాసరావు, బొడ్డు కేశవ, మెనెల్లి నాని, బీజేపీ నేతలు తాళ్ళూరి వరప్రసాద్, మిరియాల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు : తహశీల్దార్



ఓటర్ల స్లిప్పులను డీఎల్‌వోకి అందజేస్తున్న తహశీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్టు తహశీల్దార్ అజయ్ బాబు సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం మూడు పోలింగ్ కేంద్రాలకు అనుమతి లభించగా, వాటిలో జేబీ స్కూల్లో ఒకటి, గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూల్ మరో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో మొత్తం 1779 పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీరన్నబాబు గద్దె ఆలయ ప్రతిష్ఠ రేపు



ఆలయ పనులు జరుగుతున్న దృశ్యం

తాళ్లపూడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వేగేశ్వరపురంలో వీరన్నబాబుగద్దె అత్యంత ఆదరణ పొందిన ప్రదేశం. ప్రస్తుతం ఓ పెంకుటింట్లో ఉంది. అయితే నూతనంగా ఆలయాన్ని నిర్మిస్తున్నారు. దాతలు, గ్రామస్థుల సహకారంతో ఈనెల 19వ తేదీన గద్దెను ప్రతిష్ఠించనున్నారు. తర్వాత 20వ తారీఖున వీరన్నబాబు సంబరం, సేవ, భారీ అన్నసంతర్పణ చేపడతామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అన్ని గ్రామాల్లో భూ రీ సర్వే : తహశీల్దార్



చిన్నాయిగూడెంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీలో రెవెన్యూ అధికారులు

దేవరపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూ సర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో భూ రీ సర్వే చేపడుతున్నట్టు తహశీల్దార్ కే.రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం చిన్నాయిగూడెంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఈ సర్వే ఎంతో దోహదపడుతుందన్నారు. రైతుల సమక్షంలోనే చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గడా మురళీ అజిత్‌కుమార్, టీడీపీ నాయకులు పిన్నమనేని సత్యనారాయణ, గోపి, పరిమి గంగాధర్, ఆచంట నాగేశ్వరరావు, చిలకా రాజేష్, గడా రవిచంద్ర, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



పెద్దేవంలో ఎక్సకవేటర్‌తో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

తాళ్లపూడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెద్దేవంలో పంచాయతీ డ్రైనేజీలపై ఆక్రమణలను తొలగించే పనులు చేపడతున్నట్టు సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ సోమవారం తెలిపారు. గతంలో కూడా కొన్ని వీధుల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ప్రస్తుతం 1, 2, 4వ వార్డుల్లో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించి డ్రైనేజీ పనులు మొదలు పెడతామన్నారు. ఆ ప్రాంతాలను వీరిద్దరు పరిశీలించారు. వీరితో పాటు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

చాగల్లులో భారీ అన్నసమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

చాగల్లు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు గత మూడురోజులుగా ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా స్వామివారికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా సోమవారం ఉత్సవాలు ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, యువజన సంఘాలు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేస్తాం : నాగేంద్ర

గోపాలపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి బీజేపీని మరింత బలోపేతం చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. చెరుకుమిల్లిలో సోమవారం బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి వెంకటేశ్వరరావు నివాసంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కమిటీలో ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేసినట్టు చెప్పారు. మండల అధ్యక్షుడిగా పిల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, సూర్యచంద్రం, ప్రధాన కార్యదర్శిగా వేముల నరేంద్ర, సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు కొండేపటి రత్నాజీ చౌదరి, రుద్ర రాఘవులు, ముళ్ళపూడి బాలనందం, పవన్, తదితరులు పాల్గొన్నారు.

'ఇసుక ర్యాంపుల్లో నిబంధనలు అతిక్రమించొద్దు'



ఆర్డీవో కార్యాలయంలో ఇసుక ర్యాంపు నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇసుక ర్యాంపులలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో డా.రాణీసుస్మిత హెచ్చరించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఇసుక ర్యాంపు నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ లారీల్లో నిబంధనలు అతిక్రమించి బిల్లు కంటే ఓవర్ లోడ్ రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు. అటువంటి లారీలకు రూ. 47 వేలు, అలాగే సంబంధిత నిర్వాహకులకు కూడా రూ. 50 వేల అపరాధ రుసుము వసూలు చేస్తామన్నారు. ఇసుక రవాణా చేసే ప్రతి లారీపై బరకాలు కట్టాలన్నారు. డ్రేజ్జింగ్‌కు ఎటువంటి అనుమతి లేదన్నారు. టాస్క్‌ఫోర్సు టీము నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. జిల్లాలో కొవ్వూరు, రాజమహేంద్రవరంల వైపు 2 టాస్క్‌ఫోర్సు టీములు పర్యవేక్షిస్తాయన్నారు. ఓపెన్ ర్యాంపులలో నిర్దేశించిన ప్రాంతాలలో మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. ర్యాంపులలో సీసీ కెమెరాలు ఖచ్చితంగా పనిచేయాలన్నారు.మరమ్మతులకు గురయితే ఏజెన్సీలే బాధ్యత వహించాలన్నారు. డీసిల్టేషన్ ర్యాంపులు గురువారం నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, పాకా జయరామ్, గెల్లా సురేష్, జీజీ చలం, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయల సంత

● మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహణ



నల్లజర్ల వ్యవసాయ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దుకాణం

నల్లజర్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతుల్లో పండించిన కూరగాయలు, ధాన్యం, పెసలు, మినుములను ప్రతి సోమవారం నల్లజర్ల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద దుకాణం ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. సింగరాజుపాలెం మహిళ మండలి ఆధ్వర్యంలో మూడు బృందాలు సేంద్రియ ఎరువుతో పండించిన కూరగాయలు, ఆహార ఉత్పత్తులను కొనుగోలు చేసి ఉద్యోగులు, ప్రజలు ఎక్కువ రాకపోకలు సాగించే చోట సాధారణ ధరలకే విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఈ పంటల కొనుగోళ్లకు జనం మక్కువ చూపిస్తున్నారు. మరిన్ని వివరాలకు మారెం కనకదుర్గ 7382419119 ను సంప్రదించాలని మహిళా సంఘం పేర్కొంది.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం



ఉండ్రాజవరంలో వైద్యులు, సిబ్బందిని సత్కరిస్తున్న అనాలయో, తదితరులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచితంగా వైద్యులు సేవలు అందించడం అభినందనీయమని ఉండ్రాజవరం బౌద్ధమ్మ పీఠాధిపతి అనాలయో పేర్కొన్నారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్యులు బౌద్ధదమ్మ పీఠంలో కొన్నేళ్లుగా వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం వైద్యులను, సిబ్బంది అనాలయో ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అనాలయో మాట్లాడుతూ తమ పీఠం ఆవరణలో కంటి, దంత పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. గత ఆరేళ్లుగా వెయ్యికిపైగా కాటరాక్ట్ ఆపరేషన్లు చేశారని చెప్పారు. గ్రామ మాజీ సర్పంచ్ గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు కుదప చక్రపాణి మాట్లాడుతూ పీఠంతో అనాలయో ఆధ్వర్యంలో వైద్యసేవలు, ఇతర సేవలు అందించడం గొప్పవిషయమని పేర్కొన్నారు. డాక్టర్ సుమ, వైద్యసిబ్బంది ఎస్. చంటిబాబు, ఎస్‌కే కరీమ్, పి. రవి, ఏ. మణికంఠ, పి. సాయికిశోర్, స్థానికులు మల్లిన సత్యనారాయణ, కళారావు, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల గిడ్డంగిలో భారీ అగ్ని ప్రమాదం

» దివాన్‌చెరువు ఫ్రూట్స్ మార్కెట్‌లో ఘటన

» పండ్లు సహా రెండు బైకులు దగ్ధం



కాలిపోతున్న పండ్ల గిడ్డంగి

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని పండ్ల మార్కెట్‌లో సోమవారం మంటలు చెలరేగాయి. ఇనుప రేకులతో వేసిన ఆరాధ్యుల శ్రీనివాసరావు(ఏఎస్ఆర్)కు చెందిన పండ్ల గిడ్డంగిలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో లోపల ఉన్న ప్లాస్టిక్ ట్రేలు అంటుకుని అమ్మకం కోసం నిల్వ చేసిన ఆపిల్, దానిమ్మ, కర్బూజ, డ్రాగన్, తదితర రకాల పండ్లు, వాటితోపాటు సమీపంలోని పండ్ల దుకాణంలో ఉంచిన రెండు బైకులు కాలిపోయాయి. స్థానికులు రాజమహేంద్రవరంలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఈ.స్వామి, జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్‌తో బాటు ఆర్యాపురం, ఇన్నీసుపేట, కొవ్వూరుల నుంచి మూడు అగ్నిమాపక శకటాలు ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ. 10 లక్షలు విలువ చేసే పండ్లు, 15 వేల ట్రేలు దగ్ధమయ్యాయని, సుమారు రూ.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు శ్రీనివాసరావు చెప్పారు. కాగా కాల్చి పడేసిన సిగరెట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నామని, ఆస్తి నష్టం సుమారు రూ.25 లక్షలు ఉండొచ్చని అగ్నిమాపక శాఖాధికారులు చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, వైసీపీ నాయకులు జక్కంపూడి విజలయలక్ష్మి, జక్కంపూడి గణేష్, డీఎస్పీ భవ్య, బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్ పరిశీలించారు.

రోడ్డుప్రమాదంలో తోటి కోడళ్లు మృతి

● వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం

● మరో వ్యక్తికి తీవ్రగాయాలు.. ఆసుపత్రికి తరలింపు



దివాన్‌చెరువు పండ్ల మార్కెట్ వద్ద రోడ్డుపై పడి ఉన్న మృతదేహాలు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి) : మరణంలోనూ తోటికోడళ్ల బంధం వీడలేదు. కూలి పనికి కలిసి వెళ్లిన వారిద్దరు ప్రమాదానికి గురై మృతిచెందారు. ఈ ఘటన జాతీయ రహదారి దివాన్‌చెరువులో సోమవారం చోటుచేసుకుంది. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాలివి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన కప్పల రిబకా (50) కప్పల చంద్రం (49) పాలచర్ల రోడ్‌లోని ఓనర్సరీలో కూలి పనులు ముగించుకుని నాగేశ్వరరావు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై రాజానగరం వైపు వెళ్తున్నారు. వీరు దివాన్‌చెరువులోని పండ్ల మార్కెట్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న టిప్పర్ వారి వాహనాన్ని వెనుక నుంచి ఢీకొనడంతో రిబకా, చంద్రం అక్కడికక్కడే మృతి చెందగా, నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి.

క్షతగాత్రుడ్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు బొమ్మూరు ఎస్ఐ రమేష్ తెలిపారు.

బైక్ ఢీకొని భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు

కడియం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మడికి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కడియం మండలం దుళ్ళ గ్రామానికి చెందిన గంటి రాజు (32) మృతి చెందాడు. రాజు, అతడి భార్య కుమారి ఓ వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా మడికి- దుళ్ల రోడ్డులో యువకులు మోటారుసైకిల్‌పై వస్తూ వీరి మోటారుసైకిల్‌ను ఢీకొన్నారు. దీంతో రాజు, కుమారికు తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వేరే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌లో ఎక్కించే లోపు రాజు మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. కుమారి రాజమహేంద్రవరం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా రాజు దంపతులకు ఏడాది వయసు ఉన్న ఓ కుమార్తె ఉంది. రాజు కేశవరంలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని స్థానికులు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలి



వేలివెన్నులో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ , ఉప సర్పంచ్ శ్రీనివాసరావు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని వేలివెన్ను గ్రామ సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తడి, పొడిచెత్తను వేర్వేరుగా తమ సిబ్బందికి ఇవ్వాలని కోరారు. సాలిడ్‌వేస్ట్‌మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యూఎమ్) షెడ్డు వద్ద వేరే చేసి, వర్మీకంపోస్టు తయారీకి ఉపయోగిస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో ఎస్‌డబ్ల్యూఎం షెడ్డు పనితీరును డ్వాక్రా మహిళలు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేషుబాబు, సిబ్బంది, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.